ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప జిల్లా వార్తలు
5
గురువారం 17 అక్టోబరు 2024

కడపలో అప్సర్ సర్కిల్ నుంచి బస్టాండు దారి కాలువను తలపిస్తున్న దృశ్యం



రోజంతా వర్షం

- స్తంభించిన జనజీవనం
- దెబ్బతిన్న వరి, ఉల్లి, మినుము
- దెబ్బతిన్న వేరుశెనగ
- రైతులకు భారీ నష్టం
- రోడ్లన్నీ జలమయం

మండలాల వారీగా వర్షపాతం మి.మీలలో..

మండలం	వర్షపాతం
పోరుమామిళ్ల	90.4
కాశినాయన	65.8
పెద్దముడియం	51.6
కలసపాడు	50.8
ఒంటిమిట్ట	49.8
బిమఠం	48.6
సీకేదిన్నె	45.8
బికోడూరు	44.2
కడప	43.6
రాజుపాలెం	42.4
రాజుపాలెం	42.4
పెండ్లిమర్రి	41.8
దువ్వూరు	41.6
కమలాపురం	40.8
ఖాజీపేట	38.4
వేంపల్లె	38.8
సిద్దవటం	35.8
చక్రాయపేట	35.4
జమ్మలమడుగు	35.4
తొండూరు	34.6
అట్లూరు	33.8
సింహాద్రిపురం	30.4
చెన్నూరు	30.4
పులివెందుల	30.2
ప్రొద్దుటూరు	30.2
గోపవరం	30.2
వేముల	29.8
వల్లూరు	29.6
బద్వేలు	29.0
ముద్దనూరు	28.0
వీఎన్‌పల్లె	27.2
కొండాపురం	25.6
లింగాల	25.2
మైలవరం	23.4
మైదుకూరు	23.0
చాపాడు	22.2
ఎర్రగుంట్ల	21.6



చెన్నూరు మండలం దౌలతాపురం వద్ద వర్షంతో దెబ్బతిన్న వరి



కడప నగరంలోని వీధుల్లో నీళ్లు నిలవడంతో వాహనదారుల పాట్లు

(కడప-ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. సీఎం చంద్రబాబునాయుడు వాయుగుండంపై ముందస్తుగానే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. దీంతో కలెక్టర్ శివశంకర్ అధికార యంత్రాంగాన్ని అలర్ట్ చేశారు. మంగళవారం రాత్రి నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తుండంతో బుధవారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఇక వర్షాల కారణంగా అధికారిక లెక్కల ప్రకారం 2241.66 ఎకరాలలో పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశారు. ఇక బుధవారం ఉదయానికి జిల్లావ్యాప్తంగా సగటు వర్షపాతం 37.7 మి.మీ నమోదైంది. పోరుమామిళ్లలో అత్యధికంగా 90.4 మి.మీ నమోదు కాగా, అత్యల్పంగా ఎర్రగుంట్లలో 21.6 మి.మీ నమోదైంది. ఇక వర్షం కురిస్తే కడప ప్రధాన రహదారులు జలమయం కావడం సర్వసాధారణంగా మారింది. మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు చెబుతుండడం రైతులు, లోతట్టు ప్రాంత జనాలను ఆందోళనకు గురిచేస్తోంది.

ఎడతెరిపిలేని వాన

జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు ఎడితెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. పులివెందుల, కమలాపురం వ్యవసాయ రీజియన్లలో ఓ మోస్తరు వర్షం కురిసినప్పటికీ వేరే చోట్ల భారీ వర్షమే కురిసింది. జిల్లాలో కేసీకెనాల్ పరిధిలో వరి, కేపీ ఉల్లి, మినుము, వేరుశెనగ పంటలు సాగులో ఉన్నాయి. ఏకధాటి వర్షం వల్ల ఈ పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు వాపోతున్నారు.

- చాపాడు మండలంలోని రాజుపాలెం, వెదురూరు, తిప్పిరెడ్డిపల్లె, నరహరిపురం గ్రామాల్లో 25రోజులక్రితం సుమారు నాలుగు వేల ఎకరాల్లో వేరుశెనగ సాగు చేశారు. ఎకరాకు సాగు పెట్టుబడి సుమారు రూ.20వేలు ఖర్చు పెట్టారు. మూడురోజులుగా కురుస్తున్న వర్షాల తో వేరుశెనగ దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.
- చెన్నూరు మండలంలో 12 రెవెన్యూ గ్రామాల్లో కోత దశకు వచ్చిన వరి 982ఎకరాల్లో దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ఇది కూడా సాయంత్రం పూట హడావుడిగా పొలాలకు వెళ్లి పరిశీలించారు. ఏకధాటి వర్షం కారణంగా ఈ నష్టం దాదాపు అధికారుల అంచనా కంటే రెట్టింపు ఉంటుందని రైతులు అంటున్నారు. దెబ్బతిన్న పంట అంతా కోత దశకు వచ్చింది. దాదాపు రూ.40వేలకు పైగా సాగుపెట్టుబడి పెట్టి పంటను కన్నబిడ్డల్లా చూసుకుంటూ వచ్చామని.. చేతికాడ ముద్ద నోటికాడ అందనట్లుగా కోత దశలో తుఫానుకు దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా వర్షం కురుస్తుండడంతో అసలు పంట చేతికిరాకుండానే మొలకలు వస్తాయేమోనన్న భయం రైతులను వెంటాడుతోంది.
- ఖాజీపేట మండలంలో కేసీకెనాల్ పరిధిలో వరి, మినుము, పెసర, ఉలవ, పత్తిసాగులో ఉన్నాయి. ఏటూరు గ్రామం నుంచి తిమ్మారెడ్డిపల్లె వెళ్లేదారిలో కేసీ కెనాల్ ఏకధాటి వర్షానికి నీరు ఓవర్‌ఫ్లో కావడంతో ఆ పక్కనున్న రైతు వెంకటేశ్వర్‌రెడ్డి పొలం నీట మునిగింది. ఇక 1850 ఎకరాల్లో మినుము, 200 ఎకరాలు పెసర, వంద ఎకరాల్లో ఉలవ పంటలు దెబ్బతిన్నాయి.
- దువ్వూరు మండలంలోని రామసాయి నగర్‌లో ఉల్లి, జిల్లెళ్లలో జొన్నపంట వర్షానికి దెబ్బతిన్నాయి. వేంపల్లెలో వరి నేలమట్టమైంది. వేంపల్లె, బి.కోడూరులో వర్షం ధాటికి వరి పైరు నాశనమైంది. ఇక కాశినాయన మండలంలో ఎడతెరిపిలేని వర్షాలతో చెట్లు నేలకూలాయి.
- వల్లూరు మండలంలో బాలుగారిపల్లెలో భారీ వర్షానికి వరిపంట నేలకొరిగింది.

కడపలో రహదారులు జలమయం

చినుకుపడితే చాలు కడప నగరం చిగురుటాకులా వణుకుతుంది. భారీ వర్షాల కారణంగా కడప జలమయం అయిపోయింది. ఆర్టీసీ బస్టాండు నుంచి అప్సరా రోడ్డు వెళ్లే రహదారి వర్షానికి కాలువలా మారింది. హోమియోపతి కాలేజీ వద్ద పరమేశ్వర స్కూలు వద్ద వర్షం నీరు నిలిచిపోయింది. రోడ్లంతా జలమయం అయ్యాయి. ఆర్టీసీ బస్టాండు నుంచి వర్షం నీరు వెళ్లే దారి లేకపోవడంతో ఆ రోడ్డంతా చెరువుగా మారింది. వైజంక్షన్‌లోని పెట్రోలు బంకు నుంచి రాజంపేట రోడ్డు అంతా జలమయమైంది. కడపలో జలమయమైన లోతట్టు ప్రాంతాలను ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లాఅధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షం దెబ్బకు బద్వేలులోని స్టేట్‌బ్యాంకు జలదిగ్బంధం అయింది. పోరుమామిళ్లలో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. జమ్మలమడుగు నగర పంచాయతీలోని 1వవార్డు మోరగుడి శిల్పాలు తయారుచేసే వీధిలో వర్షం నీరు నిలిచింది.



దువ్వూరు మండలం రాంసాయినగర్‌లో దెబ్బతిన్న ఉల్లిపంట

2,266 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా మేరకు జిల్లావ్యాప్తంగా 2,241.66 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. 28 గ్రామాల్లో 1132 మంది రైతులకు చెందిన వరి, మినుము పంటలు దెబ్బతిన్నాయని ప్రాథమిక అంచనా వేశారు. కమలాపురం, ఒంటిమిట్ట, వల్లూరు, చెన్నూరు, బి.కోడూరు, కలసపాడు మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి.




జమ్మలమడుగు మండలం మోరగుడిలో ఇళ్లల్లో నీళ్లు



చెరువును తలపిస్తున్న కడప బస్టాండు

పాలనురగలా..





జిల్లాలో మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. కడప నగర శివారులో రిమ్స్ ఆసుపత్రి సమీపంలో ఉన్న పాలకొండల్లో జలపాతం పరవళ్లు తొక్కుతోంది. పాలనురగలా దుముకుతున్న జలపాతాన్ని చూసేందుకు పర్యాటకులు, పర్యావరణ ప్రేమికులు ఇక్కడకు పెద్ద ఎత్తున వెళుతున్నారు.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప



జిల్లాలో టీడీపీ నేతలు గతంలో ఎన్నడూ లేని విధంగా బరితెగించారు. లైసెన్సు ఉన్న బార్లను లాక్కుంటూ సరికొత్త సంప్రదాయానికి తెర లేపారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తొలినాళ్లలోనే కడపలో రెండు బార్లను టీడీపీ నేతలు, జమ్మలమడుగులో ఒక బార్‌ను కూటమి నేతలు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పుడు కమలాపురం లో ఉన్న పునీత్ బార్ అండ్ రెస్టారెంటును స్వాధీనం చేసుకునేందుకు అక్కడి టీడీపీ నేతలు ఏకంగా తాళం వేసి రెండురోజులుగా బార్‌ను మూత వేయించడం మద్యం వ్యాపారుల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

టీడీపీ నేతల బరితెగింపు

- కమలాపురంలో బార్ స్వాధీనానికి యత్నం
- తమకే ఇవ్వాలంటూ హెచ్చరికలు
- ఖాళీ కాగితాలపై సంతకాలు చేయాలని హుకుం
- రెండురోజులుగా బార్‌కు తాళం వేసిన నేతలు



(కడప-ఆంధ్రజ్యోతి): కమలాపురంలో ఉన్న పునీత్ బార్ అండ్ రెస్టారెంటు రత్నాకర్ రెడ్డి పేరిట ఉంది. ఇటీవలే బార్ లైసెన్సు ఫీజు చెల్లించి రెన్యువల్ చేసుకున్నారు. అయితే ఆ నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేతలు పునీత్ బార్ అండ్ రెస్టారెంటును తమకు ఇవ్వాలంటూ నిర్వాహకులను పిలిపించి హుకుం జారీ చేశారు. ఇక పది నెలలు మాత్రమే బార్‌కు గడువు ఉందని, తాము చాలా పెట్టుబడి పెట్టామని బార్‌ను వదులుకోలేమని నిర్వాహకులు వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా వారు వినలేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం బార్ తెరిచేందుకు వెళ్లగా తెరవనీయకుండా టీడీపీ నేతలు అడ్డుకున్నారని అంటున్నారు. బుధవారం కూడా బార్‌ను తెరవనివ్వలేదు. వీళ్లకే కడపలో కూడా పునీత్‌బార్‌అండ్ రెస్టారెంటు ఉంది. రాష్ట్రంలోనే అత్యధికంగా వేలంలో రూ. 1.79 కోట్లు పలికిన బార్ ఇదే. కమలాపురంలోని బార్‌ను తమకు స్వాధీనం చేయకపోవడంతో టీడీపీ నేతలు మంగళవారం రాత్రి కడపలో ఉన్న బార్ వద్దకు వచ్చి దౌర్జన్యం చేశారని తెలిసింది. దీన్ని కూడా బుధవారం తెరవకూడదంటూ హంగామా చేశారు. ఈ మేరకు టీడీపీ నేతలు వార్నింగ్ ఇచ్చి వెళ్లారని అంటున్నారు. బుధవారం కమలాపురంలోని బార్ నిర్వాహకులను చర్చలకు పిలిచి మీరు కట్టిన లైసెన్సు ఫీజు మీకిస్తామంటూ ఆఫర్ చేసినట్లు సమాచారం. ఇప్పుడు పునీత్‌బార్ స్వాధీన యత్నం కడప జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

కమలాపురంలో నాలుగు బ్రాంది షాపులు ఓ టీవీ చానెల్ ప్రతినిధులకు లాటరీలో దక్కాయి. అవి కూడా తమకే ఇవ్వాలంటూ వారిపై కమలాపురం టీడీపీ నేతలు వత్తిడి తెస్తున్నట్లు చెబుతున్నారు. మొత్తానికి కడప జిల్లాలో టీడీపీ నేతల బరితెగింపుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. సీఎం చంద్రబాబునాయుడు ఎలాంటి కక్ష సాధింపులు లేకుండా పాలన చేస్తుంటే టీడీపీ నేతలు మాత్రం దౌర్జన్యంగా బార్లు లాక్కోవడం, ఇసుక లూటీకి పాల్పడుతుండడం గమనార్హం.

తెలంగాణకు కలెక్టర్ బదిలీ



కడప, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కడప కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలంగాణకు బదిలీ అయ్యారు. రాష్ట్ర పునర్విభజనలో భాగంగా ఈయనతో పాటు మరో ఇద్దరిని తెలంగాణ క్యాడర్‌కు, మరికొందరిని ఆంధ్రప్రదేశ్‌కు డీఓపీటీ కేటాయించింది. వీరందరూ ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ క్యాట్, తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అయినా వారికి చుక్కెదురైంది. చివరి ప్రయత్నంలో బుధవారం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేసినా ఫలితం దక్కలేదు. దీంతో కలెక్టర్ బుధవారం రాత్రి రిలీవ్ అయ్యారు. ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ అదితిసింగ్‌కు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది.

అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి

- నేడు పాఠశాలలకు సెలవు : జేసీ

కడప(కలెక్టరేట్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో జిల్లాలో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అధికారులు అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా స్థాయి అధికారుల మొదలు మండల స్థాయి అధికారుల వరకు బుధవారం టెలికాన్ఫరెన్స్ ద్వారా జేసీ సమీక్షించారు. ముందుగా ఆయా శాఖల అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. జేసీ మాట్లాడుతూ వర్షాల కారణంగా ప్రాణ నష్టం, పశు నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అధికారులందరూ వారు పనిచేసే స్థానంలో అందుబాటులో ఉండాలన్నారు. వర్షాలు ఆగిపోయే వరకు సెలవులు మంజూరు చేయవద్దన్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రం సహా డివిజన్లలో 24 గంటల పాటు పనిచేసే విధంగా కంట్రోల్ రూములను ఏర్పాటు చేశామన్నారు. అన్ని మండల కేంద్రాల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల నుంచి కంట్రోల్ రూముకు ఫోన్ కాల్స్ వచ్చిన వెంటనే తగు సహాయం అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. కాగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గురువారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు జేసీ సెలవు ప్రకటించారు.

వైసీపీ ప్రభుత్వంలో పేదలకోసం ఇళ్లు కాదు ఊర్లు నిర్మిస్తున్నామని చెప్పి సెంటు స్థలంలో స్వంత ఇంటినిర్మాణం కోసం జగనన్న లేఅవుట్‌లు ఏర్పాటు చేశారు. పట్టణాలకు 5 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో స్థలాలు కేటాయించారు. అక్కడ మౌలిక వసతులు ఏర్పాటు చేయకనే వేలాది గృహనిర్మాణాలు ప్రారంభించారు. రూ.19.52 కోట్లు వెచ్చించి పైపులైన్లు ఏర్పాటు చేసినా నీరు అందని స్థితి. దీంతో క్యూరింగ్ లేక నాసిరకంగా నిర్మాణాలు సాగుతున్నా అధికారులు పట్టించుకోకుండానే కాంట్రాక్టర్లకు బిల్లులు చేసి చేతులు తడుపుకుంటున్నారు.

రూ.కోట్లు వెచ్చించినా నిరుపయోగం..!



బొల్లవరం లేఅవుట్‌లో అలంకారప్రాయంగా మారిన తాత్కాలిక నీటి ట్యాంకులు



అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసిన పైపులైను

ప్రొద్దుటూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో పేదల ఇళ్ల నిర్మాణాల కోసం బొల్లవరంలో 213 ఎకరాలు, రామేశ్వరంలో 160 ఎకరాలు, మీనాపురంలో 104 ఎకరాలలో జగనన్న లేఅవుట్‌లు వేశారు. 478 ఎకరాల ఈ భూములకు దాదాపు రూ.167 కోట్ల ప్రజాధనం వెచ్చించారు. మొత్తం 23,048 ప్లాట్లు ఏర్పాటు చేయగా.. ఇందులో రామేశ్వరంలో 4,549, బొల్లవరంలో 6,592, మీనాపురంలో 2,326 గృహనిర్మాణాలను హౌసింగ్ అధికారులు ప్రారంభించారు. ఇందులో బేస్‌మెంట్ లెవెల్‌లో 7,490, లింటల్ లెవెల్‌లో 78, రూఫ్‌లెవెల్‌లో 1,765 , ఆర్‌సీ లెవెల్లో 1301, నిర్మాణాలు పూర్తయినవి 356గా అధికారులు వెల్లడిస్తున్నారు. వీటినిర్మాణానికి ఇప్పటివరకు మెటీరియల్‌తో సహా రూ.112.98 కోట్లు ఖర్చు చేశారు.


వినియోగంలోకి రాని పైపులైను పథకం

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు నీటి వసతి కల్పించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం బొల్లవరం లేఅవుట్‌లో రూ.19.52 కోట్లతో తాత్కాలిక పైపులైను నిర్మాణంతో పాటు 312 తాత్కాలిక నీటి ట్యాంకుల (సిస్టన్స్) నిర్మాణం చేపట్టారు. ఈ పనులను విఘ్నేశ్వర కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో 2021లో అగ్రిమెంటు చేసుకున్నారు. 18 నెలల కాలంలో పనులు పూర్తిచేసి ట్యాంకులకు నీటిని అందించాలి. పనులు పూర్తయిన తర్వాత మరో రెండేళ్లపాటు కాంట్రాక్టరే ఉచితంగా మెయింటనెన్స్ చేయాల్సి ఉంటుంది. ఈ పైపులైనుతో పాటు పెన్నానది ఒడ్డున ఉండే రామేశ్వరం హెడ్‌వాటర్ వర్క్స్ వద్ద 7 బోర్లు వేశారు. వీటి ద్వారా సంపునకు నీళ్లు పంపి పైపులతో 8.5 కిలోమీటర్ల మేర ఉండే బొల్లవరం లేఅవుట్‌కు నీటిని సరఫరా చేస్తారు. బొల్లవరం లేఅవుట్‌లో రెండు సంపులు నిర్మించి వాటిద్వారా పైపులైను గుండా లేఅవుట్‌లలో ఉండే సిస్టన్స్‌కు నీళ్లు అందించాల్సి ఉంటుంది. ఈ మేరకు రూ.19.52 కోట్లతో చేపట్టిన ఈ పైపులైను పనులు సకాలంలో పూర్తి చేయలేదు. అంతేకాకుండా లేఅవుట్‌లో పైపులైను నిర్మాణం చేపట్టినప్పటికి పెన్నానది నుంచి బొల్లవరం లేఅవుట్‌వరకు 8.5 కి.మీ పైపులైను పూర్తికాకపోవడంతో నీటిని అందించటం చాలా ఆలస్యం అయింది. నీటిని లేఅవుట్‌లోని సంపులకు అందించినా తిరిగి పైపులైను ద్వారా తాత్కాలిక నీటి ట్యాంకులకు నీళ్లు ఇవ్వలేదు. ఇక్కడ మొత్తం 312 నీటి ట్యాంకులు ఉన్నాయి. వీటిలో 162 ట్యాంకులకు నీటిని ఎక్కించే జీఐ పైపులు, కొళాయి పైపులు చోరీకి గురయ్యాయి. అంతేకాక పైపులైను కూడా చాలా చోట్ల నాసిరకంగా వేయడంతో నీళ్లు లీకవుతున్నాయి. ఇంటి నిర్మాణం చేసే క్రమంలో పైపులైన్లు కొన్ని చోట్ల దెబ్బతిన్నాయి. కేవలం ఇళ్ల నిర్మాణం కోసం రూ.19.52 కోట్లతో చేపట్టిన తాత్కాలిక పైపులైను నీటి ట్యాంకులు ఇప్పటికీ నీటిని అందించలేకపోవడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రామేశ్వరం లేఅవుట్‌లో 41 బోర్లు

రామేశ్వరం లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలకోసం 41 బోర్లు ఏర్పాటు చేశారు. ఏ నుంచి ఎఫ్ బ్లాక్ వరకు 6 బ్లాకుల్లో మొత్తం 15 ప్యాకేజీలుగా బోర్ల నిర్మాణంతో పాటు పైపులైను పనులు తాత్కాలిక నీటి ట్యాంకుల పనులు చేపట్టారు. 15 ప్యాకేజీలలో మొత్తం రూ.4.57 కోట్లతో పనులు ప్రారంభించారు. 26.17 కి.మీ మేర ఇంటర్నల్ పైపులైను నిర్మించారు. 203 నీటి ట్యాంకులు నిర్మించారు. వీటిని ప్యాకేజీల కింద నలుగురు కాంట్రాక్టర్లు చేపట్టారు.

- వినియోగంలోకి రాని పైపులైను పథకం
- పేదల ఇంటి నిర్మాణానికి అందని నీళ్లు
- అలంకారప్రాయంగా నీటి ట్యాంకులు
- నాసిరకంగా ఇంటి నిర్మాణాలు



నీరు లేక సరిగా క్యూరింగ్ చేయక పోవడంతో గోడలు పగుళ్లు బారిన దృశ్యం

రామేశ్వరం లేఅవుట్‌లో కూడా 41 బోర్లలో దాదాపు 11 బోర్లకు స్టార్టర్లు కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. 30 బోర్లు సక్రమంగా వినియోగించక అవి చెడిపోయాయి. దీంతో రామేశ్వరం లేఅవుట్‌లో కూడా దాదాపు రూ. 5కోట్ల ప్రజాధనం వెచ్చించినా ఇళ్ల నిర్మాణాలకు నీటిని అందించలేని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా వీటిని సరిచేసి నీటిని అందజేయాలని ఇక్కడి లబ్ధిదారులు కోరుతున్నారు.

ఏడాది పొడవునా టమోటా పంట సాగు చేస్తూ నష్టాలు చవిచూస్తున్న పడమటి ప్రాంత రైతులకు ఓ రైతు వంగ సాగులో లాభాలు రుచి చూపిస్తున్నారు. టమోటా సాగులో అవలంభించే కట్లు, తీగ పద్ధతిలోనే వంగ సాగును వినూత్నంగా చేపట్టి, మేలైన వంకాయలను అధిక దిగుబడితో పండించడమే కాకుండా వాటిని చెన్నైకు ఎగుమతి చేస్తున్నారు.


వినూత్నంగా సాగు చేసిన వంకాయ తోట



ఏపుగా కాసిన వంకాయలు

వినూత్నంగా వంగ సాగు

- ఎకరాకు రూ.5 లక్షల లాభం
- వంకాయలు చెన్నైకు ఎగుమతి

మదనపల్లె టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వంగ సాగులో రైతులు సాధారణ పద్ధతిలో సాగు చేస్తూ తెగుళ్ల, పురుగుల దెబ్బకు సరైన దిగుబడి రాక నష్టాల పాలైన సంఘటనలో కోకొల్లలు. అలాంటి వంగ పంటకు తెగుళ్ల దెబ్బపడకుండా, పురుగుల నుంచి కొత్త పద్ధతుల్లో రక్షణ కల్పిస్తూ అధిక దిగుబడులు సాధిస్తూ తోటి రైతులకు మార్గదర్శంగా నిలిచారు మదనపల్లె మండలం సీటీఎం గ్రామానికి చెందిన రైతు ఆనంద పార్థసారథి. సీటీఎం-పెద్దపల్లె మార్గంలో రెండెకరాల భూమిని లీజుకు తీసుకున్న ఆయన లోతు దుక్కులతో భూమిని దున్ని, ఆవుపేడ ఎరువులతో సారవంతం చేశారు. సాధారణ వంకాయల సాగుకు ప్రత్యామ్నాయంగా మంచి రంగు, పొడవు ఉండే వంకాయలను పండించడానికి నడుం బిగించాడు. నర్సరీ నుంచి ఉజాల రకం వంకాయ మొక్కలను కొనుగోలు చేసి తీసుకొచ్చాడు. దుక్కులు దున్నిన భూమిలో మల్చింగ్ పేపర్ వేసి ఎకరాకు 7 వేల చొప్పున మొక్కలు నాటారు. నాటిన మొక్కలకు డ్రిప్ పద్ధతిలో నీటిని అందిస్తూ అడుగు పొడవు పెరిగాక వంకాయ మొక్కలను పొడవుగా పెరిగేందుకు స్టాక్స్ (ప్లాస్టిక్ తీగలు) కట్టారు. పది అడుగులకు ఒకచోట కర్రలను నాటి, ఆ కర్రలకు ప్లాస్టిక్ తీగలు అడ్డంగా కట్టాడు. ఈ ప్లాస్టిక్ తీగల కిందికి జొన్నపుర్రిలకు వంకాయ మొక్కల రెమ్మలు కట్టి పైకి ఎగబాకేలా ఊతం ఇచ్చారు. నెల రోజుల్లో ఐదడుగుల ఎత్తు పెరిగిన వంగ మొక్కలు పూత పూయడం ప్రారంభించాయి. 30 నుంచి 50 రోజుల్లో పూత పిందె పట్టి, కాయలు కాయడం మొదలు పెట్టాయి.

ఈ రకం వంకాయ సాగును వేసవిలో సాగు చేస్తే తెగుళ్ల, చీడ పురుగుల బెడద లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవచ్చు. శీతాకాలంలో పురుగులు ఎక్కువగా పడే అవకాశం ఉంది. దీనిని బట్టి చూస్తే జనవరి నుంచి అక్టోబరు వరకు ఈ రకం వంగ పంట సాగుకు అనుకూలం. పచ్చదోమ తక్కువగా, తెల్లదోమలు ఎక్కువగా ఈ పంటను ఆశిస్తాయి. వీటిని గమనించుకుంటూ వారానికి ఒకసారి మందులు పిచికారీ చేస్తే, ఆరు నెలల పాటు వంకాయలు కోతలు పడతాయి.


పొడవైన వంకాయలు

ఎకరాకు 15 టన్నుల దిగుబడి

వంకాయ సాధారణ సాగులో ఎకరాకు 8 నుంచి 10 టన్నుల వంకాయలు మాత్రమే దిగుబడి వస్తుంది. అదే స్టాక్స్ పద్ధతిలో మేలు రకం వంకాయ సాగులో ఎకరాకు 15 టన్నుల దాకా దిగుబడి వస్తోంది. ఎకరా విస్తీర్ణం సాగులో తొలికోతలో 300 కిలోల దిగుబడి రాగా, తరువాత వరుస కోతల్లో 1000, 2000, 3500 కిలోల దాకా వంకాయలు పండుతున్నాయి. రెండు నెలల్లో 14 కోతలు కోయగా సరాసరిన 15 వేల కిలోలు వంకాయలు దిగుబడి వచ్చాయి.

లాభాల పంట

ఈ రకం వంకాయ సాగులో రైతులు లాభాలు చవిచూడొచ్చు. ఎకరా వంకాయ సాగుకు ఎకరాకు రూ.1.65 లక్షలు పెట్టుబడి పెట్టాల్సి వుంది. ఇలా సాగు చేసిన వంకాయ పంట ఎకరాకు 15 టన్నుల దిగుబడి వస్తుంది. చెన్నైలో కిలో వంకాయ రూ.30 కనీస ధర పలికినా రూ.4.50 లక్షలు వస్తుంది. ఖర్చులు పోను ఎకరాకు ఎంత లేదన్నా కనీసంగా రూ.3 లక్షలు లాభాలు వస్తున్నాయి. డిమాండ్ పెరిగితే ఒక్కోసారి హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో వంకాయలు రూ.100 కూడా పలుకుతాయి. దీనిని బట్టి చూస్తే రైతులకు ఎకరాకు అన్ని ఖర్చులు పోను గ్యారెంటీగా రూ.5 లక్షలు వరకు లాభం వస్తుందని అంచనా.

పంట మార్పిడితోనే భూమి సారవంతం



ప్రతి ఏటా వ్యవసాయంలో రైతులు పంట మార్పిడితో భూమి సారవంతం చేయొచ్చు. అలాగే తెగుళ్ల, చీడ పీడలు అంతగా సోకే ఆస్కారం లేకుండా చేయొచ్చు. ఎంత వర్షాలు వచ్చినా ఎర్రరేగడి నేలలో టమోటా, వంకాయల సాగులో మొక్కలు నీటి నిల్వలను తట్టుకుంటాయి. మూడు రోజులకు ఒకసారి నీటి తడి అందిస్తే చాలు. వంకాయ మొక్కలు ఏపుగా పెరుగుతాయి. వంకాయ సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి రావడమే కాకుండా, నాణ్యమైన వంకాయలు చేతికి అందుతాయి. మదనపల్లె ప్రాంతంలో ఈ రకం వంగ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. కానీ ఇక్కడ మార్కెటింగ్ లేక చెన్నైకు రవాణా చేయాల్సి వస్తోంది. మదనపల్లెలో ప్రభుత్వం వంకాయ మార్కెట్ ఏర్పాటు చేస్తే రైతులకు రవాణా ఖర్చు తగ్గిపోయి, ఇంకా రాబడి పెరుగుతుంది.

- ఆనంద పార్థసారథి, రైతు, సీటీఎం గ్రామం.

మున్సిపల్ పూర్వ కమిషనర్ ఇంక్రిమెంట్లలో కోత

- మరో ఇద్దరు ఉద్యోగులకూ కోత....

కలికిరి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో గతంలో పనిచేసిన కమిషనరుతో సహా మరో ఇద్దరు ఉద్యోగులు భవన నిర్మాణాల అనుమతుల విషయంలో అక్రమాలకు పాల్పడ్డారనే కారణంతో రెండేసి ఇంక్రిమెంట్లలో కోత విధిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు చేసింది. 2021లో ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనరుగా పనిచేసిన పి.వి.వి.ఎస్. మూర్తి భవన నిర్మాణాలకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చారని, అనధికార నిర్మాణాల తొలగింపు విషయంలో చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని, సెట్ బ్యాక్ నిబంధనలను అతిక్రమించినా పట్టించుకోలేదన్న అభియోగాలతో ఆయనకు గతంలో ప్రభుత్వం నోటీసులిచ్చింది. దీని పైన కమిషనరు ఇచ్చిన సంజాయిషీలు విచారణలో నిలవకపోవడంతో చివరికి రెండు వార్షిక ఇంక్రిమెంట్లలో కోత విధించాలని నిర్ణయించి ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే విధమైన అభియోగాలతో జరిగిన విచారణలో అప్పట్లో మున్సిపాలిటీ టీపీఎస్‌గా పనిచేస్తున్న సి.టి.కృష్ణసింగ్, టీపీబీవోగా పనిచేస్తున్న ఎస్.మహబూబ్ బాషాలపై కూడా నిర్ధారణ కావడంతో ఇరువురి ఇంక్రిమెంట్లలో రెండేసి వంతున కోత విధించారు. ఈ మేరకు మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి రాష్ట్ర ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ బుధవారం విడివిడిగా ఆదేశాలు జారీ చేశారు.

పీటీడీ ఇంజనీరుకు కర్నూలు బాధ్యతలు

కడప ప్రజా రవాణా శాఖ (ఏపీఎస్ఆర్టీసీ)లో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీరుగా పనిచేస్తున్న పి.ఎల్.భాస్కర్‌కు కర్నూలు పీటీడీ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీరుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. మూడు నెలల వరకు గానీ లేదా రెగ్యులర్ నియామకం జరిగే వరకు గానీ ఈ బాధ్యతలు నిర్వర్తించాలని రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మెడికల్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ కడపకు బదిలీ

మదనపల్లె ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పాథాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ స్పందనను ప్రభుత్వం బదిలీ చేసింది. కడప ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అదే విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియమించింది. మానవతా దృక్పథంతో బదిలీలపై ఉన్న నిషేధాన్ని సడలించి ఆదేశాలిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. అదే విధంగా కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈఎన్‌టీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ బి.సుధను విజయనగరం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అదే విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు బుధవారం వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.

వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి డిప్యుటేషన్ పొడిగింపు

కడప జిల్లా లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ అసోసియేషన్‌లో వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారిగా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న డాక్టర్ ఎస్.పెంచలరాజుకు మరో ఏడాది డిప్యుటేషన్ పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జూలై 16 నుంచి 2025 జూలై 15వ తేదీ వరకూ ఈ డిప్యుటేషన్‌ను పొడిగించారు. కాగా కడప పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డికి నెల రోజుల సెలవును ప్రభుత్వం మంజూరు చేసింది. వ్యక్తిగత పనుల మీద అమెరికా వెళ్లేందుకు అనుమతిస్తూ నవంబరు 23వ తేదీ నుంచి డిసెంబరు 24 వరకూ ఈ సెలవును మంజూరు చేసింది. ఈ రెండు ఉత్తర్వులను రాష్ట్ర పశు సంవర్ధక శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ జారీ చేశారు.

అందరూ అప్రమత్తంగా ఉండాలి


- సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

నిమ్మనపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. బుధవారం ముష్టూరులోని బాహుదా ప్రాజెక్టును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు ఉండడంతో అధికారులు నిత్యం పర్యవేక్షణలో ఉండాలన్నారు. అలాగే బాహుదా ప్రాజెక్టుకు ఎన్ని గేట్లు ఉన్నాయి.. ప్రాజెక్టు సామర్థ్యం, పూర్తి స్థాయిలో నిండి ఎంత కాలమైంది.. అనే విషయాలను అధికారులను అడిగారు. అదే విధంగా వర్షాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు గ్రామాల్లో పర్యటించి పంటల నష్టం వివరాలను తెలుసుకోవాలన్నారు. అలాగే కుంటలు, చెరువుల వద్ద ప్రజలు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ సురేంద్రరెడ్డి, డీఈ ప్రసాద్, తహసీల్దార్ ధనంజేయులు, ఏఈఈ శ్రీహరి రెడ్డి, ఆర్ఐ రాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


బాహుదా ప్రాజెక్టు వద్ద సబ్ కలెక్టర్

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.లక్ష విరాళం

పీలేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల సహాయ నిధికి పీలేరులోని పారా మిలటరీ అసోసియేషన్ సభ్యులు రూ.లక్ష విరాళం అందజేశారు. విజయవాడలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో బుధవారం వారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఈ మేరకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పీఎస్ ఖాన్, కార్యదర్శి పి.చంద్రశేఖర్, అడ్వైజర్ బీసీ రెడ్డప్ప, కోశాధికారి రమణబాబు, తదితరులు పాల్గొన్నారు.


విరాళం చెక్కును ముఖ్యమంత్రికి అందజేస్తున్న పీలేరు వాసులు

మిగిలిన ప్రభుత్వ మద్యం సీజ్

మదనపల్లెటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఇదివరకు నిర్వహించిన 22 ప్రభుత్వ మద్యం దుకాణాలకు ఎక్సైజ్ సీఐ భీమలింగ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. బుధవారం మదనపల్లె, రామసముద్రం, నిమ్మనపల్లె, కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లోని 22 ప్రభుత్వ మద్యం దుకాణాలను ప్రత్యేక బృందాలతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మిగిలిన మద్యం స్టాకును రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి, సీజ్ చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే ఈ మద్యాన్ని ఎక్సైజ్ డిపో అధికారులకు అప్పగిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎక్సైజ్ ఎస్ఐలు జబీవుల్లా, డోర్కాస్, హెచ్‌సీ అలీ తదితరులు పాల్గొన్నారు.


మద్యం దుకాణాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

చెరువు కట్టల పటిష్టతపై దృష్టి పెట్టండి : ఎమ్మెల్యే

మదనపల్లెటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణానికి పడమర వైపున ఎగువన వున్న మూడు చెరువుల పటిష్టతపై అధికారులు దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశించారు. బుధవారం మండలంలోని చీకిలబైలు పంచాయతీ మేడిపల్లె చెరువు, కదిరమ్మచెరువు, వెంకటమ్మ చెరువులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996 సంవత్సరంలో వరదలు వచ్చినపుడు మూడు చెరువులు తెగిపోయి వరద నీరంతా మదనపల్లె పట్టణం మీద పడి అనేకమంది మృతి చెందారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఇలాంటి పరిస్థితులు పునరావృత్తం కాకుండా చెరువుకట్టల స్థితిపై ఇరిగేషన్ అధికారులు అధ్యయనం చేసి నివేదికలు ఇవ్వాలన్నారు. చెరువు కట్టలు బలహీనంగా ఉంటే ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాగా కదిరమ్మ చెరువును, అక్కడ వున్న పరిస్థితులను సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ పరిశీలించారు. బుధవారం తహసీల్దార్ ఖాజాబీ, జల వనరులశాఖ అధికారులతో కలసి చెరువు కట్టను పరిశీలించారు. చెరువు కట్ట ఎక్కడైనా తెగిపోయే అవకాశం వుందా.. అలాంటివి జరగకుండా ముందస్తు చర్యలపైన ఇంజినీర్లతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జల వనరులశాఖ ఈఈ సురేంద్రరెడ్డి, ఏఈ రాయలబాబు రాజేంద్రప్రసాద్, ఆర్ఐ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.


కదిరమ్మచెరువు కట్టపై అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

పీలేరుకు తప్పిన ఏనుగుల బెడద

- కల్లూరు ఘాటుకు తరలిన గుంపు
- ఫలించిన అటవీ శాఖ సిబ్బంది యత్నాలు

పీలేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పీలేరును వణికించిన గజరాజుల బెడద తప్పింది. పీలేరు ఇందిరమ్మ కాలనీ వద్ద తిష్ట వేసిన 15 ఏనుగుల గుంపును అటవీ ప్రాంతంలోకి పంపేందుకు అటవీ సిబ్బంది చేసిన ప్రయత్నాలు ఫలించాయి. జనావాసాలకు దూరంగా చిత్తూరు-పీలేరు మార్గంలోని కల్లూరు ఘాటు సమీపంలో ఉన్న గంటావారిపల్లె అటవీ ప్రాంతంలోకి వాటిని మళ్లించగలిగారు. దీంతో ఇందిరమ్మ కాలనీతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే వాటిని అటవీ ప్రాంతం వైపు మళ్లించే క్రమంలో అవి ప్రయాణించిన మార్గంలోని పంట పొలాలు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. వరి, టమోటా, మామిడి, కొబ్బరి పంటలు దెబ్బతిన్నాయి. పీలేరు, మదనపల్లె సెక్షన్ల అటవీ సిబ్బంది బుధవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు. తాము పరిశీలించిన వివరాలను అటు వ్యవసాయ, ఇటు ఉద్యాన శాఖాధికారులకు అందజేసి ఆయా రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

కుప్పం టు పులిచెర్ల, పులిచెర్ల టు పీలేరు

పీలేరుకు వచ్చిన ఏనుగుల మంద ఎక్కడిదని మంగళవారం పీలేరు ప్రాంతంలో పెద్దఎత్తున చర్చ జరిగింది. పీలేరుకు తలకోన, మంగళంపేట అటవీ ప్రాంతం సమీపంలో ఉండడంతో తలకోన నుంచి అవి వచ్చి ఉంటాయని చాలా మంది భావించారు. అయితే అవి తలకోనకు చెందినవి కావని, పలమనేరులోని కౌండిన్య అభయారణ్యం నుంచి చాలా కాలం క్రితం సోమలవైపు వచ్చిన గుంపులోనివేనని అటవీ సిబ్బంది బుధవారం నిర్ధారించారు. నాలుగు రోజులుగా పులిచెర్ల మండలం మంగళంపేట ప్రాంతంలోని అటవీ సిబ్బంది, రైతులు పెద్దఎత్తున బాణాసంచా పేల్చి వాటిని అడవిలోకి మళ్లించే ప్రయత్నాలు చేశారు.

అధిక మోతాదులో జరిగిన పేలుళ్ళ, వర్షం కారణంగా అవి దారితప్పి పీలేరు ప్రాంతంలోకి ప్రవేశించినట్లు మదనపల్లె, పీలేరు సెక్షన్ల అటవీ సిబ్బంది నిర్ధారించారు. ఏనుగులు ప్రయాణించిన మార్గంలోని పీలేరు మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ చిన్న గాండ్లపల్లె, పెద్దగాండ్లపల్లె, ఆవులవారిపల్లె, రామిరెడ్డిగారిపల్లె, పులిచెర్ల మండలంలోని కొన్ని గ్రామాల్లో వరి, టమోటా, మామిడి, కొబ్బరి పంటలకు నష్టం వాటిల్లింది. పంట నష్టం జరిగి ఉంటుందని అంచనా వేసిన మదనపల్లె సెక్షన్ ఫారెస్టు సిబ్బంది వేణుగోపాల్, గిరి, సుధాకర్, షాజహాన్, శోభారాణి, రామ్మోహన్, దీప, జ్యోతి బుధవారం వేకువజామునే ఆయా గ్రామాలకు చేరుకుని 13 మంది రైతులకు చెందిన పంటలకు నష్టం వాటిల్లినట్లు నిర్ధారించారు. మంగళవారం ఏనుగులు తిష్ట వేసిన మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు యల్లెల రెడ్డప్పరెడ్డి తోటకు కూడా భారీగా నష్టం వాటిల్లినట్లు అధికారులు తేల్చారు. ఏనుగుల దాడిలో మంగళవారం ఉదయం మరణించిన రైతు చిన్న రాజారెడ్డి అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామం బందార్లవారిపల్లెలో జరిగాయి.


ఏనుగులు ధ్వంసం చేసిన టమోటా పంటను పరిశీలిస్తున్న ఫారెస్టు సిబ్బంది

'పాల'సముద్రం

- దినాదినాభివృద్ధి చెందుతున్న పాల ఉత్పత్తి
- డ్వాక్రా మహిళలకు కల్పతరువు పాడి పరిశ్రమ

పాడి పరిశ్రమ ఆర్థిక ప్రగతికి చక్కని సోపానమని చెప్పవచ్చు. వ్యవసాయ రంగం ఒడిదుడుకుల కారణంగా చాలామంది రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఇలాంటి తరుణంలో పశుపోషణ ద్వారా పాడి పరిశ్రమను ఏర్పాటు చేసుకుంటే ఆర్థిక ఇబ్బందులు తొలుగుతాయి. రామసముద్రం మండలంలో అత్యధికమంది ప్రజలు పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇక్కడ రోజు దాదాపు 5 వేల లీటర్ల పాలను అమ్ముతున్నారు. దీంతో ఈ మండలాన్ని పాలసముద్రంగా పిలుచుకుంటున్నారు.



రామసముద్రం, అక్టోబరు 16: రామసముద్రం మండలంలో పాడి పరిశ్రమ దినదినాభివృద్ధి చెందుతోంది. మూడు సంవత్సరాలుగా వర్షాలు బాగా పడి భూగర్భజలాలు వృద్ధి చెందాయి. దీంతో రైతులు తమ బీడు భూములు సైతం సాగు చేసి పశుగ్రాసం పెంచి పాడి పరిశ్రమ వైపు మొగ్గు చూపుతున్నారు. గత కొంతకాలంగా పాల ధరలు రోజురోజుకు పెరుగుతుండడం, పశువులపై పెట్టిన పెట్టుబడి వ్యయం స్థిరంగా ఉండడం, రోజువారీ నిలకడమైన ఆదాయం వస్తుండడంతో రైతులు పశుపోషణపై మక్కువ చూపుతున్నారు. తమ వ్యవసాయ పొలంలోనే డెయిరీ ఫామ్ ఏర్పాటు చేసి పశుపోషణ చేస్తూ లాభాలను పొందుతున్నారు. రైతులు పశుపోషణను ఎన్నుకోవడానికి ప్రధాన కారణం పంటలపై పెట్టిన పెట్టుబడి నిలకడగా లేని ధరలతో నష్టాలను చవిచూడడం, పాల ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో రైతులు పశుపోషణపై ఆసక్తి చూపుతున్నారు. అంతేకాకుండా ఇతర పంటల మార్కెటింగ్ ఖర్చుతో పోలిస్తే పాల మార్కెటింగ్ ఖర్చులు చాలా తక్కువగా ఉండడం కూడా పశుపోషణకు మరో కారణంగా చెప్పవచ్చు. మండలంలో 13 వేల పశువులు ఉన్నట్లు అంచనా. వాటి ద్వారా రోజుకు సుమారుగా 50 వేల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నట్లు తెలుస్తోంది. మండల కేంద్రంలోనే దాదాపుగా రోజుకు 5 వేల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతుండడంతో రామసముద్రంను పాలసముద్రంగా పలు డెయిరీల యజమానులు అభివర్ణిస్తున్నారు. మండల పరిధిలో తిరుమల డెయిరీ, అమూల్ డెయిరీకి సంబంధించిన పాల సేకరణ కేంద్రాలు ఉన్నాయి. ఇవి కాకుండా మదనపల్లె కేంద్రంగా ఉంటూ రామసముద్రం మండలంలోని వివిధ గ్రామాల్లో పాల సేకరణ చేస్తున్న డెయిరీలు ఉన్నాయి. వాటిలో సంగం, హెరిటేజ్, దొడ్ల, జెర్సి, శ్రీకృష్ణ, బాలాజి డెయిరీలు ఉన్నాయి. ఇవే కాకుండా మండల సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని కేఎంఎఫ్, మూమార్కు డెయిరీలు సైతం రామసముద్రం మండలంలోని పలు ప్రాంతాల్లో తమ పాల సేకరణ కేంద్రాలు ద్వారా పాలను సేకరిస్తున్నారు. దీంతో పాల సేకరణలో పోటీతత్వం పెరిగి పాలకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. ప్రస్తుతం దాదాపు అన్ని పాల డెయిరీలు నాలుగు శాతం వెన్న, ఎనిమిది శాతం ఎస్ఎన్ఎఫ్ ఉన్న పాలకు రూ.34 నుంచి రూ.36 చెల్లిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఇది మరింతగా పెరిగి అవకాశాలు ఉన్నట్లు పాల సంస్థ యజమానులు అంటున్నారు. పశుపోషణ లాభదాయకంగా ఉండడంతో ఉన్నత చదువులు చదివిన వారు ఉద్యోగం కోసం ఎదురుచూడక పశుపోషణతో లాభాలు గడిస్తున్నారు.


డెయిరీకి పాలు పోస్తున్న డ్వాక్రా మహిళలు

పశుపోషణ ఓ కల్పతరువు

పశుపోషణ కుటుంబం ఇంటిల్లిపాది చేస్తూ ఒక కుటీర పరిశ్రమగా ఉండడంతో పాల ఉత్పత్తిలో మహిళలది ప్రముఖ స్థానం అని చెప్పవచ్చు. ముఖ్యంగా డ్వాక్రా సంఘాల మహిళలు తమ పొదుపు సంఘాల ద్వారా ఆర్థిక రుణాలు పొంది వాటిని పశుపోషణపై వెచ్చించి ఆర్థికాభివృద్ధి చెందుతున్నారు. రుణాలు సకాలంలో చెల్లిస్తుండడంతో బ్యాంక్‌లు మహిళలకు మరింతగా రుణాలు అందించడానికి మొగ్గు చూపుతున్నారు. అంతేకాక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశుగ్రాసం పెంపకానికి ఆర్థిక చేదోడు అందుతుండడంతో పశుపోషణ సులువుగా ఉంది. పాలతో ప్రతిరోజూ నిలకడైన ఆదాయంతో కుటుంబ పోషణకు మహిళలు ఆసరాగా ఉన్నారు.


పొలంలో షెడ్ వేసి ఆవులను పెంచుతున్న దృశ్యం

లాభదాయకంగా ఉంది..



గత పదేళ్లుగా వ్యవసాయం చేస్తున్నాను. ఇందులో దానిమ్మ, కొత్తిమీర తదితర పంటలు సాగు చేసి సరైన గిట్టుబాటు ధరలు లేక లక్షల్లో నష్టం వాటిల్లింది. దీంతో వ్యవసాయం వదిలేసి ఆరునెలల ముందు రూ.10 లక్షలు ఖర్చుతో 6 ఆవులు, వాటికి షెడ్డు నిర్మించుకున్నాను. నాలుగు ఎకరాల్లో కొంత హైబ్రిడ్ పశుగ్రాసం మరికొంత మొక్కజొన్న పశుగ్రాసం సాగు చేశాను. ఇప్పుడు రోజుకు 60 లీటర్ల పాలు డెయిరీకి వేస్తున్నాను. దీని ద్వారా రోజుకు రూ.2 వేల ఆదాయం వస్తోంది. ఖర్చులు పోను రోజుకు రూ.1500 మిగులుతోంది. దీనికి తోడు పశు వ్యర్థాలు పొలాలకు ఎరువులుగా ఉపయోగపడుతోంది. అంతేకాకుండా పశువుల రొట్టతో పంటల దిగుబడి పెరిగింది.

-వెంకటేష్, రైతు.

వైవీయూ పీజీ కోర్సుల్లో నేరుగా ప్రవేశాలు

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్, ఎంపీఈడీ కోర్సుల్లో ఈనెల 17 నుంచి 27వ తేదీ వరకు నేరుగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లు రెండుసెట్ల జిరాక్స్, నిర్ణీత ఫీజుతో యూనివర్శిటీలోని ఏపీజే అబ్దుకలాం ప్రాంగణలో ఉన్న ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. ఏపీ పీజీ సెట్ 2024 ఎంట్రెన్స్ రాసి అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే ప్రవేశాలకు అర్హులన్నారు. ఇతర వివరాలకు వైవీయూ వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

ఖాళీల వివరాలు : ఇంగ్లీష 35, తెలుగు 39, ఉర్దూ 26, జర్నలిజం 33, హిస్టరీ 29, పొలిటికల్ సైన్స్ 26, ఎకనామిక్స్ 41, కామర్స్ 37, బయకెమిస్ట్రీ 21, బయోటెక్నాలజీ 5, మైక్రో బయాలజీ 5, జెనెటిక్స్ అండ్ జినోమిక్స్ 29, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ 31, బోటనీ 16, జువాలజీ 6, మ్యాథ్స్ 38, ఫిజిక్స్ 26, మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ 34, కెమిస్ట్రీ 9, జువాలజీ 26, సైకాలజీ 24, ఫిజికల్ ఎడ్యుకేషన్ 38, ఫుడ్ టెక్నాలజీ 22, కంప్యూటరు సైన్స్ 13, కాంపటీషనల్ డేటా సైన్స్ 27 ఖాళీలు ఉన్నాయన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీఓ



నదిలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

కమలాపురం రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గేంత వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. లోతట్టు ప్రాంతీయులకు అవగాహన కల్పించాలని ఆర్డీఓ జాన్ ఎరివిన్ పాలపర్తి తెలిపారు. బుధవారం కమలాపురం తహసీల్దారు కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలు కురుస్తున్నాయని.. రెవెన్యూ పరిధి అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం తుఫాను ప్రభావం ఎక్కువగా ఉందని, ఎలాంటి నష్టాలు రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు. పెన్నా, పాపాఘ్ని నదుల పరివాహక లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. వీఆర్వోలు సమాచారం సేకరించి కంట్రోలు రూముకు తెలపాలన్నారు. అనంతరం పెన్నా, కుందూ నది సమీపంలో నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దారు శివరామిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫుడ్ టెక్నాలజిస్ట్స్ పాత్ర కీలకం



ఆహార కల్తీలను ఎలా గుర్తించవచ్చో వివరిస్తున్న విద్యార్థులు

పులివెందుల రూరల్, అక్టోబరు 16: (ఆంధ్రజ్యోతి): సరైన పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించడం, ప్రాసెసింగ్ శాతం పెంచడం, ఫుడ్ వేస్టేజ్ అరికట్టడంలో ఫుడ్ టెక్నాలజిస్ట్స్ పాత్ర కీలకమని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ వివరించారు. బుధవారం స్థానిక ఆహార విజ్ఞానశాస్త్ర, సాంకేతిక కళాశాలలో ప్రపంచ ఆహార దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు అంతా ఫుడ్ ప్రాసెసింగ్ రంగానిదే అన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు ఆహార కల్తీని ఎలా సులభంగా గుర్తించవచ్చో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎల్‌బీవి సెంటర్‌లో ఉన్న చిరుధాన్యాలు, పండ్ల ప్రాసెసింగ్ కోసం ఏర్పాటు చేసిన యంత్రాలు ఉపయోగ వివరాలను వివరించారు. కార్యక్రమంలో కడప ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ డాక్టర్ ఎం.హరిత, పులివెందుల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కిషోర్‌బాబు, పులివెందుల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్.నాగరాజు, అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ ప్రారంభం



బెడుదూరు వద్ద ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్

కొండాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెడుదూరు గ్రామం సమీపంలో చిత్రావతి నదిలో ఇసుకరీచ్‌ను బుధవారం తహసీల్దార్ గురప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా రీచ్ వద్ద కూటమి నాయకులతో కలిసి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఇప్పటికే మండలంలో ఏటూరు, పి.అనంతపురం గ్రామాల వద్ద ఇసుకరీచ్‌లు ఉండగా బెడుదూరు వద్ద మరో రీచ్‌ను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక రవాణా ప్రారంభమవుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎన్డీయే కూటమి నాయకులు అరుణ్ కుమార్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నాగిరెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అరటిలో ఆకుమచ్చ తెగులు నివారణకు చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రారెడ్డి

వేముల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అరటి పంటలో సిగటోక ఆకుమచ్చ తెగులు ఉధృతి పెరిగే అవకాశం ఉందని.. నివారణకు చర్యలు తీసుకోవాలని ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రారెడ్డి రైతులకు సూచించారు. బుధవారం మబ్బుచింతలపల్లెలో మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి అధ్యక్షతన పొలం పిలుస్తోందిలో ఆయన మాట్లాడుతూ గెల వేయని చెట్లకు ప్రొపెకోనాజోల్ 2ఎంఎల్ లీటర్ నీటికి హర్టికల్చర్ మినరల్ ఆయిల్ 10ఎంఎల్ కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. గెల వేసిన చెట్లకు ప్రొపెకోనాజోల్, డిఫెనాకానాజోల్ మందు మిశ్రమాన్ని పిచికారీ చేసుకోవాలని, మందు పిచికారీ చేసిన తర్వాత మాత్రమే తెగులు సోకిన ఆకులను కోసివేయాలని, భూమిలోని తేమను చూసుకుని తోటకు నీరు పెట్టాలని తెలిపారు. ప్రస్తుతం వర్షాల తర్వాత యూరియా, పొటాష్‌ను డ్రిప్‌లో పంపించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కే అసిస్టెంట్ మోహన్‌కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

రహదారులు.. రక్తసిక్తం



- నిర్లక్ష్యం, అతివేగంతోనే ప్రమాదాలు
- ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులు
- నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదం
- గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
- ట్రాఫిక్ రూల్స్ పాటిస్తేనే.. ప్రమాదాలు తగ్గుముఖం

కడప (క్రైం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యం, అతివేగంతో ప్రతి నిత్యం ఎక్కడో ఒక చోట ప్రమాదం సంభవిస్తూ నిండు ప్రాణాలు కోల్పోతున్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోవడం.. మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం... ముఖ్యంగా యువత హైస్పీడుతో బైకులు నడుపుతుండ టంతో వారితో పాటు ఇతరులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. దీంతో రోడ్డు ప్రమాదాల్లో పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు కడుపుకోత అనుభవించాల్సి వస్తోంది. అలాగే కుటుంబ పెద్దలను కోల్పోయిన పిల్లలు అనాథల్లా మారిపోతున్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని వాహ నాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తే ప్రమాదాల తీవ్రత తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు.

చిన్నపాటి నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి అవుతున్నాయి. తప్పు ఎవరిదైనా వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించకపోతే మనతో పాటు ఇతరులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. ప్రస్తుతం ఉన్న వాహనాలు హైస్పీడ్ కలిగి ఉండటం.. నిర్లక్ష్యం, అతివేగం, జాగ్రత్తలు పాటించక పోవడంతో ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ఇటీవల జిల్లాలో తరచూ ఎక్కడో ఒకచోట ప్రమాదాలు సంభవిస్తూ.. కుటుంబ సభ్యులు కడుపుకోత అనుభవించాల్సి వస్తోంది. ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాల తీవ్రత తగ్గుతుంది. 50 స్పీడ్‌లో వెళ్లాల్సిన వారు 100, 120 స్పీడ్‌లో పోతే ఏ మాత్రం అదుపు తప్పినా ప్రాణాలు గాల్లోనే కలిసిపోక తప్పదు. వాహనదారుడు నిర్లక్ష్యం, ఓవర్ టేకింగ్, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు రోడ్డు రవాణా శాఖా అధికారులు అవగాహన కలిగిస్తున్నప్పటికీ కొందరిలో మార్పు కనిపించడంలేదు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. అధికారులు మాత్రం ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటిస్తేనే... ప్రమాదాలను నిరోధించే అవకాశం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి



ప్రతి వాహనదారుడు వాహనం నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు అతివేగం, ఓవర్‌టేక్, మద్యం సేవించి డ్రైవింగ్ చేసేటప్పుడే ప్రమాదాలు సంభవిస్తాయి. ప్రమాదాలు జరిగినప్పుడు వారు ప్రమాదాలు కొని తెచ్చుకోవడమే కాక ఎదుటి వారి ప్రాణాలు కూడా తీసేందుకు కారణమవుతున్నారు. కావున ప్రతి డ్రైవరు జాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తూ వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలి. నగర శివార్లలో వాహనదారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్నాం.

-జావీద్, కడప ట్రాఫిక్ సీఐ

రోడ్డు ప్రమాదాలను గమనిస్తే...

- ఆగస్టు 26న అన్నమయ్య జిల్లా కడప జిల్లా బార్డర్ అయిన గువ్వల చెరువు ఘాట్ వద్ద కారును లారీ ఢీ కొన్న సంఘటనలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు.
- జూన్ 17న కడప నగరం రాజంపేట రోడ్డులోని గురుకుల బాలికల పాఠశాల వద్ద ఆర్టీసీ బస్సు కారు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు ప్రాణాలు విడిచారు.
- జూన్ 16న ఆర్టీసీ అద్దె బస్సు అలంఖాన్‌పల్లె సర్కిల్ సమీపంలోని పాత టోల్‌గేటు వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు.
- మార్చి 25న ఒంటిమిట్ట ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు స్పాట్ డెడ్.
- మే 15న కొండాపురం వద్ద లారీ, తుఫాను వాహనాన్ని ఢీకొట్టడంతో ఏడుగురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఇటీవల సిద్దవటం పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు మహిళలు దుర్మరణం చెందారు. ఉమ్మడి జిల్లాలో ఇలాంటి ప్రమాదాలు రోజూ ఎక్కడో చోట జరుగుతూనే ఉన్నాయి. దీనికంతటికీ వాహనదారుల నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపమే ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

గండికోటకు మళ్లీ కృష్ణాజలాలు

- 4వేల క్యూసెక్కులు చేరిక
- వరదనీరు 2వేల క్యూసెక్కులు
- మైలవరం జలాశయానికి నీరు విడుదల



గండికోట నుంచి మైలవరం జలాశయానికి నీరు విడుదలవుతున్న దృశ్యం



మైలవరం జలాశయం నుంచి పెన్నాకు నీరు విడుదల చేస్తున్న దృశ్యం

కొండాపురం / మైలవరం అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అవుకు రిజర్వాయిర్ నుంచి బుధవారం గండికోట ప్రాజెక్టుకు 4 వేల క్యూసె క్కుల కృష్ణాజలాలు వస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకల ద్వారా ప్రాజెక్టులోకి మరో 2వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరింద న్నారు. ఇప్పటికే ప్రాజెక్టులో తగినంత నీటిమట్టం ఉండటంతో గేట్లు ఎత్తి మైలవరం జలాశయానికి 7500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామన్నారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.2 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఆయన వివరించారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జలాశయ డీఈఈ నరసింహామూర్తి తెలిపారు. గండికోట జలాశయం నుంచి నీరు వచ్చి మైలవరంలో చేరుతుండటంతో బుధవారం పెన్నాకు 8వేల క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 30 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. వర్షాల కారణంగా మైలవ రానికి ఇన్‌ఫ్లో పెరిగితే మరింత నీటిని పెన్నానదికి వదిలే అవకాశం ఉందని.. పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మైలవరం జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

ఉరి వేసుకుని మహిళ మృతి



సికెదిన్నె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని నూకలబోయిన నాగలక్ష్మి (38) మృతి చెందినట్లు చింతకొమ్మదిన్నె సీఐ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం జమాల్‌పల్లెకు చెందిన నాగలక్ష్మి భర్త రవిచంద్ర ఏడేళ్ల కిందట మరణించాడని, ఒంటరితనం భరించలేక శ్వాస సంబంధిత వ్యాధితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని చనిపోయినట్లు తెలిపారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి



ఖాజీపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆంజనేయకొట్టాలుకు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని చంద్రశేఖర్‌రెడ్డి (60) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఆంజనేయకొట్టాలుకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి పని నిమిత్తం వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కాలు విరగడంతోపాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 ద్వారా కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జమ్మలమడుగు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణ శివార్లలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సున్నపురాళ్ల గ్రామానికి చెందిన పూజారి రాజేష్ (28) తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అతన్ని అదే రోజు జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. తిరుపతిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి బుధవారం తరలించి పోస్టుమార్టం నిర్వహించి.. కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బాకీ విషయమై దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు...

మదనపల్లె మండలం చిప్పిలి గ్రామం భువనేశ్వరీనగర్‌కు చెందిన జగదీష్ (27) దేవీవరప్రసాద్ వద్ద తన ద్విచక్రవాహనం కుదవ పెట్టి ఎనిమిది నెలల క్రితం రూ.40వేలు అప్పుతీసుకున్నారు. ఎన్నిసార్లు అడిగినా చెల్లించకపోవడంతో బుధవారం రాత్రి జగదీష్ మల్లికార్జున సర్కిల్‌లో ఉన్నాడని తెలుసుకుని దేవీవరప్రసాద్ తన మిత్రులు సురేష్, వెంకీ, భాస్కర్‌తో కలిసి దాడి చేసి కొట్టారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ ఆ నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



రామసముద్రం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసై కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. రామసముద్రం మండలం భూసాని కురపల్లెకు చెందిన బుత్తన్నగారి శంకర(50) గత కొన్నేళ్లుగా తాగుడుకు బానిసై తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో గురువారం యథావిధిగా కుటుంబ సభ్యులతో గొడవపడి మనస్తాపం చెంది సీతరగానిపల్లె సమీపంలో పొలంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

కోడిపందెం రాయుళ్లు అరెస్టు

మదనపల్లె అర్బన్, అక్టోబరు16: (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం, వీవర్స్ కాలనీ సమీపంలో కోడిపందెం ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. బుధవారం స్థానిక వీవర్స్ కాలనీ సమీపంలో కోడి పందెం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో టూటౌన్ ఎస్ఐ రవికుమార్, సిబ్బందితో అక్కడికి వెళ్లి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు నాటు కోళ్లు, రూ.3020 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కారు ఢీ.. దంపతులకు తీవ్రగాయాలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కారు బైకును ఢీకొన్న సంఘటనలో దంపతులు తీవ్రంగా గాయపడినట్లు మదనపల్లె వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. వివరాల మేరకు... మండలంలోని కోళ్లబైలు గ్రామపంచాయతీ, జగన్‌కాలనీకి చెందిన దంపతులు వెంకటరమణ (48), మేనక (42) ద్విచక్రవాహనంపై మదనపల్లె పట్టణానికి వచ్చారు. పనులు చూసుకుని తిరిగి ఇంటికి తిరుగు ప్రయాణంలో అమ్మచెరువు మిట్ట గంగమ్మగుడి వద్దకు రాగానే బైకును మదనపల్లెకు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన దంపతులను జిల్లా ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం స్థానికులు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీకి దసరా ఆదాయం రూ.59లక్షలు

కడప మారుతీనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చిన ప్రయాణికుల ద్వారా రూ.59,38,002 ఆదాయం వచ్చిందని ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 8వతేదీ నుంచి 11వ తేదీ వరకు సుమారు 283 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి విజయవాడ, బెంగ ళూరు, హైదరాబాదు, చెన్నై, తిరుపతి, కర్నూలు తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు ప్రయాణికులను రప్పించామన్నారు. దీంతో ఆయా బస్సుల ద్వారా ఈ ఆదాయం సమకూరిందన్నారు.

మందు రేట్లు తగ్గలే..!

మందుబాబుల అసంతృప్తి

పోరుమామిళ్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం ధరలు తగ్గిస్తామని చెప్పిన మాటలు హామీలకే పరిమితమయ్యాయి. బుధవారం జిల్లావ్యాప్తంగా పలుచోట్ల మద్యం దుకాణాలు ప్రారంభం అయ్యాయి. అయితే ఎక్కడా ప్రభుత్వం ప్రకటించిన మేరకు రూ.99కే మద్యం ఇవ్వలేదు. అన్నీ పాత ధరలకే అమ్మారు. చెప్పిందొకటి చేసేదొకటి అన్న రీతిలో మద్యం ప్రియులు విమర్శలు గుప్పించారు. పోరుమామిళ్లలో కొత్తగా నాలుగు మద్యం షాపులు మంజూరు కావడంతో ప్రభుత్వ దుకాణాలకు సీల్ వేశారు. దీంతో మధ్యాహ్నం 3గంటల వరకు మద్యం అందుబాటులోకి రాకపోవడంతో మందుబాబులు మద్యం కోసం షాపుల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. మరికొందరు బ్లాక్‌లో అమ్మేవారి నుంచి కొనుగోలు చేశారు. సాయంత్రం అయ్యేసరికి మందుబాబులంతా మద్యంషాపుల వద్ద గుమికూడారు. ఎక్సైజ్ అధికారులు ఎమ్మార్పీ ధరల పట్టిక ఏర్పాటు చేయలేదు. గోడౌన్ నుంచి పూర్తిస్థాయిలో మద్యం సరఫరా కాకపోవడంతో షాపులు దక్కించుకున్న వారు అధికారుల ఆదేశాలు వచ్చేంత వరకు పాత ధరలనే కొనసాగించనున్నారు. రూ.99కే మద్యం అందకపోవడంతో మద్యంప్రియుల నుంచి అనేక విమర్శలు వెల్లువెత్తాయి.

సామాజిక తనిఖీలో అవకతవకలు

- ఫీల్డ్‌అసిస్టెంట్ల చేతివాటంపై డ్వామా ఏపీడీ ఆగ్రహం



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

చెన్నూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన సామాజిక తనిఖీలో అవకతవకలు బయటపడ్డాయి ఉప్పరపల్లె, ముండ్లపల్లె, రాచిన్నాయపల్లెకు సంబంధించి రూ.12వేలు అవకతవకలు జరిగి నట్లు బయటపడింది. సమావేశంలో డ్వామా ఏపీడీ నాగరత్నమ్మ జరిగిన అవకతవకలపై మండిపడ్డారు. ఫీల్డ్ అసిస్టెంట్లు చేతివాటం ప్రదర్శించారని.. అందులో మస్టర్లలో కొట్టివేతలు, పనులు చేయకపోయినా ఉపాధి కూలీ ఇవ్వ డంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో మాట్లాడుతూ 1.4.2023 నుంచి 31.3.2024 వరకు మండల వ్యాప్తంగా 932 పనులు జరిగాయని, 7.34 లక్షల ఖర్చు చేశారన్నారు. దీనిపై నిర్వహించిన సామాజిక తనిఖీలో రూ.12వేలు రికవరీ చేశారు. మస్టర్లలో జరిగిన అవకతవకలకు ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యులని తనిఖీ బృందం వివరించారు. దీంతో సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సురేశ్‌బాబు, ఏపీఓ శైలజ, ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, టీడీపీ నేతలు కిరణ్ మోహనరావు, కె.విజయభాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



చినుకు రాలె.. వరి నేలవాలె...

రైతు గుండెల్లో తుఫాను ● మరో మూడురోజులు వర్షాలు కురిస్తే తీవ్ర నష్టమే ● కోత ధర చుక్కల్లోనే....



చెన్నూరులో కోత దశలో ఉన్నవరి

చెన్నూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తుపాను దెబ్బతో ఏకధాటిగా చినకులు రాలుతుండగా చేతికొచ్చిన వరి పంట నేల వాలిపోయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో చెలరేగిన తుపాను రైతుల గుండెను అవిశిపోయేలా చేస్తోంది. మరో మూడు రోజులు వర్షం ఇలాగే కురిస్తే చేలో ధాన్యం మొలకలు వస్తాయని రైతులు వాపోతున్నారు. కోయాల్సిన పరిస్థితే వస్తే కోతమిషన్ బాడుగ గంటకు దాదాపుగా మూడు నుంచి నాలుగు వేల రూపాయలు కూడా అడుగుతున్నారని వాపోతున్నారు. చెన్నూరు మండలంలో 982 ఎకరాల్లో వరిపంట నేలవాలిందని మండల వ్యవసాయాధికారి శ్రీదేవి తెలిపారు. కమలాపురం, వల్లూరు మండలాల్లో 850 ఎకరాల్లో వరి పైరు నేలకొరిగిందని, 250 ఎకరాల మినుము పంటలో నీరు చేరిందని ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు పంపించామని వ్యవసాయ సహాయ సంచాలకులు పి.వెంకటక్రిష్ణ తెలిపారు. వివరాల్లోకెళితే....

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మూడురోజులుగా కురుస్తున్న వర్షాలు రైతు గుండెలను గుబేలుమనిపిస్తోంది. మండల వ్యాప్తంగా బోర్ల కింద సాగు చేసిన వరి పంట ప్రస్తుతం కోత దశకు చేరుకుంది. సుమారు మరో వారం పది రోజుల్లో వెయ్యి ఎకరాల పంట కోయాల్సి ఉంది ఇలాంటి పరిస్థితుల్లో కురుస్తున్న వర్షం రైతులను భయాందోళనకు గురి చేస్తోంది. నిరంతరాయంగా వర్షం కురుస్తుండడం రైతుకు నష్టాన్ని కలిగించే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఫలితంగా ధాన్యంపై మొ లకలు రావడం, గింజలు నల్లగా మారుతుందని ఇదే పరిస్థితి గతంలో ఉండేదని భయపడుతు న్నారు. రామనపల్లె, బయనపల్లె, గుర్రంపాడు తదితర ప్రాంతాల్లో కోత దశలో వరి సిద్ధంగా ఉంది. రెండు మూడు రోజుల కిందటే కోయాలనుకున్న రైతులు తు పా ను ప్రభావిత వర్షాలతో బెంబేలెత్తుతున్నారు.

982 ఎకరాల్లో వరిపంటకు నష్టం

వరి నేలవాలిన ప్రాంతాలను వ్యవసాయాధికారి శ్రీదేవి పర్యటించి ఏ మేరకు వరి నేలవాలిందని నష్టంపై నివేదికలు తయారు చేశారు. చెన్నూరు మండలంలో సుమారు 982 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనా తయారు చేశారు. 12 రెవెన్యూ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను బుధవారం ఏఓ పరిశీలించారు. దౌలతాపురం, రామనపల్లె, బయనపల్లె గ్రామాల్లో వరి పంట వర్షాలతో నీట మునిగిందని, పలుచోట్ల నీటిలోనే పంట వాలడంతో ధాన్యంపై మొసులు వచ్చాయన్నారు.

బాలుగారిపల్లెలో...

వల్లూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో చేతికి వచ్చిన వరి పంట వర్షంధాటికి నేలకొరిగిందని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. బాలుగారిపల్లెలో దాదాపు 70 నుంచి 80 ఎకరాలకు పైగా రెండు మూడురోజుల్లో కోయాల్సిన పంట వర్షం ధాటికి వాలిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తుండడంతో కోతకు వచ్చిన వరికి మోసులు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓకవేళ కోయాల్సిన పరిస్థితి వస్తే మిషన్ బాడుగ గంటకు దాదాపు మూడు నుంచి నాలుగు వేల రూపాయలకు కూడా అడుగుతున్నారని వాపోతున్నారు. మినుముపంట కూడా అక్కడక్కడా కొంత దెబ్బతిన్నట్లు సమాచారం. వర్షం ధాటికి దాదాపు రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇలాగే కొనసాగితే తీవ్రంగా నష్టపోతామన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

వీరపునాయునిపల్లె మండలంలో....

వీరపునాయునిపల్లె, అక్టోబరు16 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రబీలో సాగుచేసిన ప్రత్యామ్నాయ పంటలు దెబ్బతింటున్నాయని రైతుల ఆందోళన చెందుతున్నారు. అప్పు చేసి వేల రూపాయలు పెట్టుబడి పెట్టి శనగ, పెసర వంటి పంటలను సాగుచేశామని పలువురు రైతులు అన్నారు. ఇపుడు వర్షం కురుస్తుండడంతో పంటలు పూర్తిగా దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమలాపురం మండలంలో...

కమలాపురం రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలో పంటలు నీట మునిగాయి. తుపాను ప్రభావంతో అధిక వర్షానికి గంగవరం సమీపంలో వరి పంట నేలకొరిగింది. రైతులను ఆదుకోవాలని కోరారు. గంగవరం గ్రామంలో కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పర్యటించారు. వరి, మినుము పంటలను పరిశీలించారు. తుపానుతో కమలాపురం, వల్లూరు మండలాల్లో 850 ఎకరాల్లో వరి పైరు నేలకొరింగిదని ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు. వరి పంటలో పడిపోయిన దుబ్బులను నిలబెట్టి గుంపులుగా కట్టాలని సూచించారు. వర్షం ఆగిన వెంటనే ఎరువులు 19 -19 - 19ను ఐదు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. పిచికారీ చేసుకోవడం వల్ల పంటలను కాపాడుకోవచ్చని తెలిపారు. మండల వ్యవసాయాధికారి సరస్వతి పలు గ్రామాల్లో పంటలను పరిశీలించారు. వ్యవసాయ సహాయకులు పి.వెంకటక్రిష్ణ, రైతులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న చెన్నూరు మండల వ్యవసాయాధికారి శ్రీదేవి

వేంపల్లె మండలంలో....

వేంపల్లె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి రైతుకు తీరని నష్టం జరిగింది. వేంపల్లె, కుమ్మరావం పల్లె, ఇడుపులపాయ, అలిరెడ్డిపల్లె, తువ్వపల్లె గ్రామాల్లో సాగులో ఉన్న వరి పంట నేలవాలింది. చేతికొచ్చిన పంట కళ్లముదే దెబ్బతినడంతో లబోదిబోమంటున్నారు. నష్టపోయిన వరి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.





వల్లూరు, వేంపల్లె మండలాల్లో నేలకొరిగిన వరిపంట - కమలాపురం మండలంలో పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కూటమి ప్రభుత్వంలో పల్లెలకు మహర్దశ

పెండ్లిమర్రి, చింతకొమ్మదిన్నె మండలాల్లో సీసీరోడ్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

పెండ్లిమర్రి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో పల్లెలకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే పుత్తాకృష్ణచైతన్యరెడ్డి అన్నారు. బుధవారం చెర్లోపల్లె పంచాయతీ భైరవగుట్ట వద్ద పల్లె పండుగలో భాగంగా సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడం, సంక్షేమ పథకాలను అమలు చేస్తామని తెలిపారు. ఎన్‌ఆర్ ఈజీఎస్ పథకం కింద మండలానికి రూ.2.91లక్షల నిధులు సీసీరోడ్ల నిర్మాణానికి ఖర్చుచేశామన్నారు. చెర్లోపల్లె పంచాయతీలో సీసీరోడ్లకు రూ.17లక్షల నిధులు ఇచ్చామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీ, ఉపాధి నిధులను పక్కదారి పట్టించారన్నారు. ప్రస్తుతం పంచాయతీల సమగ్ర అభివృద్ధి కోసం సీసీ రోడ్లు, డ్రైన్లు, శ్మశానాల ప్రహరీ, లింకు, గ్రావెల్ రోడ్లు నిర్మాణం చేపట్టి పల్లెల సమగ్ర అభివృద్ధి చేపట్టామన్నారు. రెండు గొర్రెల షెడ్లు ఏర్పాటుకు పంచాయతీకి అనుమతులు వచ్చాయన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి మినీ గోకులాలు మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. సర్పంచు గంగిరెడ్డి, తహసీల్దార్ అనురాధ, ఉపాధి పీడీ సోమశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, పీఆర్ ఏఈ రహంతుల్లా టీడీపీ నేతలు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జమాల్‌పల్లెలో...

సికెదిన్నె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రగతిని పరుగులు పెట్టిస్తామని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. జమాల్‌పల్లెలో పల్లెపండుగలో సిమెంటు రోడ్లకు శంకుస్థాపన చేసిన ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన పనులను వారిచేతే గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో చేస్తామన్నారు. సంక్రాంతికల్లా పనులు పూర్తి చేసి గ్రామోదయాన్ని విజయవంతం చేస్తామన్నారు. ఎంపీడీఓ కుళాయిబాబు, ఏపీఓ రామాంజులరెడ్డి, ఈఓఆర్‌డీ సుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, టీడీపీ నేతలు క్రిష్ణారెడ్డి, మోహన్‌బాబు, భద్ర, జబీవుల్లా, రెడ్డిబాష, దర్బార్‌బాష, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే



అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే మాధవి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తుపాను కారణంగా ప్రజలందరూ అప్రమత్తగా ఉండాలని కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కడప నగరంలో పలు ప్రాంతాలను అధికారులతో కలిసి సందర్శించిన వారు మాట్లాడుతూ రోడ్లపైన నీరు నిల్వకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని సూచించారు. డ్రైనేజీలు బ్లాక్ కాకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదకర ట్రాన్స్‌పార్మర్లను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులకు తెలిపారు. జిల్లాలో తుపాను కారణంగా అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనరు రాకేశ్ చంద్రం, ఈఈ ధనలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

పులివెందులలో టీడీపీలోకి భారీగా చేరికలు

పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్సీ బీటెక్‌రవి



టీడీపీలోకి చేరిన వారితో బీటెక్ రవి

పులివెందుల టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయి. మాజీమార్కెట్‌యార్డు ఛైర్మన్ రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూదనరెడ్డి మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి సారెడ్డి గంగాధర్‌రెడ్డి, సారెడ్డి పార్థసారధిరెడ్డి, భూమిరెడ్డి పురుషోత్తంరెడ్డి, పోచంరెడ్డి రఘునాథ్‌రెడ్డి, తిప్పిరిపాటి రమేశ్, షేక్ బాషా, జగదీశ్వర్‌రెడ్డి, సూర్యనారాయణ రమేశ్ తదితరులు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాధరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు వస్తున్నాయని వచ్చే సాధారణ ఎన్నికల్లో వైసీపీని బలంగా ఎదుర్కొని టీడీపీ జెండా ఎగురవేస్తామన్నారు. సారెడ్డి గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు. కార్యక్రమంలో రఘునాధరెడ్డి, పార్థసారధిరెడ్డి, సిద్దారెడ్డి, విశ్వనాథరెడ్డి, దేవిరెడ్డి, సంజీవరెడ్డి, అమర్, టీడీపీ నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నడుమ మద్యం షాపు వద్దని మహిళల ఆందోళన



కడప క్రైం అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఎర్రముక్కపల్లెలో కొత్తగా ఏర్పాటు చేసిన మద్యంషాపు నివాసగృహాల వద్ద పెట్టవద్దంటూ స్థానిక మహిళలు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్కూల్స్ దేవాలయాలున్న చోట మద్యం దుకాణాలు నడప కూడదు. అయితే సోమవారం కలెక్టరు ద్వారా మద్యం దుకాణాలు డిప్ తీశారు. అయితే ఎర్రముక్కపల్లె సర్కిల్ నుంచి అంగడివీధి వెళ్లే మార్గమధ్యలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తుండగా స్థానిక మహిళలు తమ ప్రాంతంలో మద్యం షాపు వద్దంటూ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఆందోళనకు దిగారు. తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ రామకృష్ణ మహిళలకు సర్దిచెప్పి పంపించారు.

పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి

సికెదిన్నె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త వీరయ్య, శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. వేరుశనగ, కంది, శనగ, ఉల్లి సాగు చేసిన రైతులు అధిక వర్షాల్లో నేలలో తేమ ఎక్కువగా ఉండి మొదుళ్లు కుళ్లిపోవడం, తెగుళ్ల వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కాబట్టి నీరు నిల్వ ఉండకుండా చేయాలని, వర్షం ముగిసిన తర్వాత అధికారులు, శాస్త్రవేత్తల సూచనల ప్రకారం మందులు వాడాలన్నారు. కూరగాయల సాగు పొలంలో నీరు నిలిస్తే టమోట, పసుపు, పూలతోటలు పంట నాణ్యత దెబ్బతినకుండా చీడపీడల ఉధృతి పెరగకుండా భూమిలోని పోషకాలు మొక్కలకు అందేలా కొద్దిపాటి సూచనలతో పంటలను రక్షించుకోవాలన్నారు. వరి, పత్తి, మొక్కజొన్న, మినుము, పెసర తదితర పంటల్లో కూడా వర్షాలు ఆగిన వెంటనే అంతర్ సేద్యం చేసి కలుపు తొలగించాలన్నారు. నేల కొంచెం ఆరిన తర్వాత రసాయనిక ఎరువులను నేలలో వేసుకుని పంటలను కాపాడుకోవాలన్నారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా సీవీ ప్రసాద్

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా సీవీప్రసాద్, రాధాక్రిష్ణ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఏపీటీఎఫ్ అమరావతి కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్‌చంద్ర, ఆలీఖాన్, చెంగల్‌రెడ్డి, ఉమాకాంత్ హర్షం వ్యక్తం చేశారు.



సీవీప్రసాద్ - రాధాక్రిష్ణ

జడ్పీ సీఈఓను కలిసిన ఏపీపీఆర్ఎంఈఏ నేతలు

కడప రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జడ్పీ సీఈఓ ఓబులమ్మను ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీపీఆర్ఎంఈఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. నాగిరెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు లంకా మల్లేశ్వరరెడ్డి, శ్రీనివాసులరెడ్డి బుధవారం కలిసి మొక్కను అందజేశారు. బాధ్యతలు చేపట్టిన ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెపండుగ విజయవంతం చేసేందుకు జడ్పీ అధికారులు, ఉద్యోగులు ముందుండాలని సూచించారు.



జడ్పీ సీఈఓకు మొక్కను అందజేస్తున్న నేతలు

'దళితులపై దాడులు అరికట్టాలి'

పులివెందుల రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దళితులపై దాడులు అరికట్టాలని ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 14వ తేదీ రాత్రి సింహాద్రిపురం మండలం బలపనూరులో నిర్బంధించి, దాడి చేసిన ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న ముమ్మె వెంకటరమణ, ఆయన కుమారుడు భార్గవ్‌ను పరామర్శించిన ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ ప్రభుత్వంలో మాదిగలకు ఇచ్చిన ఇనాం భూమిని లాక్కునేందుకు ఖాళీ అగ్రిమెంట్ పత్రాలపై సంతకాలు చేయించుకోవడం, ఇక్కడ జరిగిన విషయం బయటకు చెబితే ఊర్లో ఉండలేరని బెదిరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకుని దాడులను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో డప్పు చర్మకారుల రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం తదితరులు ఉన్నారు.

కడప డీఎఫ్ఓగా బాధ్యతలు చేపట్టిన వినీత్ కుమార్

కడప క్రైం అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ కడప అధికారిగా వినీత్ కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం డీఎఫ్ఓగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సందీప్ కుమార్ రెడ్డి పాడేరుకు బదిలీ అయ్యారు. వినీత్ మాట్లాడుతూ అడవి సంపదను పరిరక్షిస్తామని ఎర్రచందనం అక్రమ రవాణా కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.



నాగేంద్ర కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

సికెదిన్నె, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కువైట్‌లో అనుమానాస్పద స్థితిలో మరణించిన బుగ్గలేటిపల్లెకు చెందిన టీడీపీ బూత్ కన్వీనర్ ఉప్పు శ్రీనివాసులు తమ్ముడు ఉప్పు నాగేంద్ర కుటుంబ సభ్యులను కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి పరామర్శించారు. నాగేంద్ర కుటుంబానికి అండగా ఉంటామని, వారి జీవనోపాధికోసం సాయం చేస్తానని, పార్టీ అన్నివిధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు మహర్షి వాల్మీకి జయంతి

కడప(కలెక్టరేట్) 16(ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి జయంతి 17వ తేదీన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శివశంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9-30 గంటలకు ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఎదురుగా వాల్మీకి విగ్రహానికి పూలమాల అలంకరణోత్సవం నిర్వహిస్తామన్నారు. 10-30 గంటలకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జయంతి జరుగుతుందని జిల్లాలోని బీసీ సంఘాల నేతలు, అధికారులు, ప్రజలు సభను జయప్రదం చేయాలని ఒక ప్రకటనలో కోరారు.

స్వర్ణోత్సవసభలను జయప్రదం చేయండి

కడప (ఎడ్యుకేషన్), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి బి.లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయకుమార్, మహేశ్‌బాబు పిలుపు నిచ్చారు. బుధవారం కడప నగర యూటీఎఫ్ కార్యాలయంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించిన వారు మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన నేపధ్యంలో స్వర్ణోత్సవ మహాసభలు జిల్లాలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఎజాజ్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనరు ప్రభాకర్ నేతలు కరీముల్లా, పెంచలయ్య, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో వాహన తనిఖీ

కడప (క్రైం), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద సీఐ రామక్రిష్ణ ఆధ్వర్యంలో వాహన తనిఖీ చేపట్టారు. ప్రతి వాహనం రికార్డులను, పెండింగు చలానాల పరిశీలించారు. మూడు పెండింగు చలానాల కంటే ఎక్కువుంటే వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. ప్రజలు తమ వాహనం పెండింగు చలానాలను చెల్లించడం, వాహన రికార్డులను దగ్గర ఉంచుకోవాలన్నారు.

రహదారిపై గుంతలు పూడ్చివేత

పోరుమామిళ్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా ప్రధాన రహదారులు గుంతలు పడడంతో సర్పంచ్ యనమల సుధాకర్ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గుంతలు పూడ్చించారు. బుధవారం ఆయన ప్రధాన రహదారుల్లో ఏర్పడ్డ గుంతలలో మట్టి వేయించి ప్రజలకు ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



అట్లూరు, ఖాజీపేటలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అధికారులు, టీడీపీ నేతలు

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం బ్రహ్మంగారిమఠం మండలంలో సిమెంటు రోడ్లు పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేశారు. ఎంపీటీసీ లలితమ్మ, ఎంపీడీవో వెంగమునిరెడ్డి, ఈవోపీఆర్‌డి రంగయ్య, ఏపీవో హరిక్రిష్ణ,టీడీపీనేతలు వెంకటేశ్వర్లు, రామసుబ్బయ్య, బాలదుగ్గిరెడ్డి, మేకల సుధాకర్, చిలమలనాగయ్య,సుబ్రమణ్యం పాల్గొన్నారు.

అట్లూరు..:మండలంలోని తంబళ్లగొంది గ్రామంలో రూ.30లక్షల ఉపాధి నిధులతో సిమెంటు రోడ్లు, గోకులం షెడ్లు తంబళ్లగొంది సర్పంచ్ మునిరెడ్డి ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్‌బాబు, ఏపీవో జయచంద్ర, బ్రహ్మారెడ్డి, పెద్దమునిరెడ్డి, ఈసీ సుధాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోపవరం..: మండలంలోని శ్రీనివాసపురంలో బుధవారం పల్లెపండుగ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో రామనాథరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజనల్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు, మండల ఇంజనీరు అధికారి శ్రీనివాసులు, అదనపు అధికారి విజయమ్మ, ఈవోపీఆర్‌డి హసీనా, టీడీపీ నాయకులు రామానాయుడు, రామసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేట..: అభివృద్ధి పథంలో మైదుకూరు నియోజకవర్గం పరుగులు పెడుతోందని టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చెన్నముక్కపల్లె, చెముళ్లపల్లె, కొత్తపేట పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దివిజ, ఏపీవో చంద్రశేఖర్, పంచాయతీ సిబ్బంది, టీడీపీ నాయకులు వెంకటరామిరెడ్డి, బాలకొండారెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

గండికోటకు కృష్ణాజలాలు

కొండాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అవుకు రిజర్వాయర్ నుంచి బుధవారం గండికోట ప్రాజెక్టుకు 4000 క్యూసెక్కుల కృష్ణాజలాలు వస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా రెండురోజులు గా కురుస్తున్న వర్షాల వల్ల వాగులు,వంకల ద్వారా ప్రాజెక్టులోకి మరో 2000 క్యూసెక్కుల నీరు వచ్చి చేరిందన్నారు. ఇప్పటికే ప్రాజెక్టులో తగినంత నీటిమట్టం ఉండటంతో గేట్లు ఎత్తి వచ్చే నీటిని మైలవరం జలాశయానికి 7500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామన్నారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, అక్టోబరు 16: మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జలాశయ డీఈఈ నరసింహమూర్తి బుధవారం తెలిపారు. గండికోటజలాశయం నుంచి 6 వేల క్యూసెక్కుల నీరు వచ్చి మైలవరంలో చేరుతుండటంతో పెన్నాకు 5 వేల క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 30 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. వర్షాల కారణంగా మైలవరానికి ఇన్‌ఫ్లో పెరిగితే మరింత నీటిని పెన్నానదికి వదిలే అవకాశం ఉందని పెన్నా పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఈఈ తెలిపారు. మైలవరం జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6 టీఎంసీల నీరు నిల్వ ఉందని డీఈఈ తెలిపారు.

బెడుదూరు ఇసుక రీచ్ ప్రారంభం

కొండాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెడుదూరు గ్రామం సమీపంలో ఇసుకరీచ్‌ను బుధవారం తహసీల్దార్ గురప్ప ప్రారంభించారు.ఈ సందర్భంగా రీచ్ వద్ద పూజ కార్యక్రమాలను నిర్వహించి స్థానిక ఎన్డీయే కూటమి నాయకులతో కలిసి రీచ్‌ను ప్రారంభించారు. కాగా చిత్రావతినదిలో ఈ ఇసుకరీచ్‌ను ఏర్పాటు చేశారు.ఇప్పటికే మండలంలో ఏటూరు, పి.అనంతపురం గ్రామాల వద్ద ఇసుకరీచ్‌లు ఉండగా బెడుదూరు వద్ద మరో రీచ్‌ను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక రవాణా ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు అరుణ్‌కుమార్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నాగిరెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

కుందూతీరం ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



నదిలో నీటిని పరిశీలిస్తున్న తహసీల్దారు రమాకుమారి

చాపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కుందూ నదిలో పెరుగుతున్న నీటిమట్టంతో తీరం వెంబడి ఉన్న గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తహసీల్దారు రమాకుమారి హెచ్చరించారు. సీతారామపురం గ్రామం వద్ద ఉన్న కుందూ నదిలో ప్రవహిస్తున్న నీటిని ఆమె బుధవారం పరిశీలించారు. నది వద్దకు ప్రజలను ఎవరిని కూడా రానివ్వకుండా కాపలా ఉండాలని వీఆర్‌ఏలను ఆమె ఆదేశించారు. కుందూనదికి నీటిమట్టం పెరిగే అవకాశాలు ఉన్నాయని, ప్రజలందరు జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఘనంగా పట్టాభిరామస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ



పోరుమామిళ్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలం లోనిరంగసముద్రం పంచాయతీ పరిధిలో కమ్మవారిపల్లె సమీపంలో ఉన్న చెంచుకాలనీలో బుధవారం ఆలయ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, హోమం కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఆలయ ఆవరణలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి కాలనీవాసులే కాక చుట్టుపక్కల ప్రజలు, నాయకులు హాజరై పూజలు చేశారు. టీడీపీ నాయకులు చెరుకూరి చెన్నరాయుడు, కల్వకూరి నడిపి వెంకటసుబ్బయ్య, కల్వకూరి చిన్నవెంకటసుబ్బయ్య, వైసీపీ నాయకులు నల్లేరు విశ్వనాథరెడ్డి ఈ ప్రతిష్ఠ కార్యక్రమాలకు హాజరయ్యారు.

పంటల పై ముందస్తు చర్యలు చేపట్టండి

ముద్దనూరు అక్టోబరు16: తుఫాన్ ధాటికి పంటలో వర్షపు నీరు ఎక్కువగా నిలిచి ఉందని పంటను కాపాడు కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఏవో వెంకటకృష్ణారెడ్డి రైతులకు సూచించారు.యామవరం గ్రామంలో వర్షపు నీటిలో ఉన్న కొర్ర పంటను బుధవారం ఏవో పరిశీలించారు.అందులో భాగంగా రైతులకు పలు సూచనలు చేశారు.పంటను కాపాడుకునేందుకు నీరు బయటకు పోయేందుకు కాల్వలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే పత్తి పంటలో తేమ శాతం ఎక్కువగా ఉంటే పోషకాలు గ్రహించే పరిస్థితి ఉండదని యూరియా 20గ్రాములు లేదా 19.19.19 అనే ఎరువును 10 గ్రాములు లేదా13.0.45 అనే మందు 20 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. వ్యవసాయసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పండ్లు, బ్రెడ్లు పంపిణీ

జమ్మలమడుగు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని నాగులకట్టవీధిలోని సిరి నిరాశ్రయుల వృద్ధాశ్రమంలో బుధవారం ముద్దనూరు ఏవో వెంకటక్రిష్ణారెడ్డి, ఆయన కుమారుడు పుట్టిన రోజును పురస్కరించుకుని వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఎం.రాధా, దివ్య అనాథ వృద్ధులు పాల్గొన్నారు.

బస్సుల దారి మళ్లింపు

జమ్మలమడుగు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్టీసీ డిపో బస్సులు ఆళ్లగడ్డకు వెళ్లే దారిలో పెద్దముడియం, పాలూరు గ్రామంలోకి వెళ్ల బస్సులను బైపాస్‌రోడ్డు గుండా దారి మళ్లించినట్లు డిపో మేనేజర్ ప్రవీణ్ బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దముడియం, పాలూరు గ్రామాల్లో నుంచి గతంలో ఆళ్లగడ్డకు బస్సులు వెళ్లేవి. ప్రస్తుతం కుందూనదిలో వరద ప్రవాహం , తుఫాను కారణంతో పెద్దముడియం, పాలూరు గ్రామాల మధ్య వంతెన కింద అధికంగా నీటి ప్రవాహం ఉంది. దీంతో సమస్య లేకుండా ముందస్తుగా బైపాస్ రోడ్డు నుంచి బస్సులు వెళ్లాలని ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. సిబ్బందితోపాటు ప్రయాణికులు, గమనించగలరని ఆయన తెలిపారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

బద్వేలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ బద్వేలు మండల కమిటీని బుధవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన మండల మహాసభలో ఎన్నుకున్నారు. ఇందులో గౌరవాధ్యక్షుడుగా సుబ్బరాజా, అధ్యక్షుడు దేవానందం, సహాధ్యక్షులు నరేష్, శివభారతి, ప్రధాన కార్యదర్శి గా సుధాకర్, ట్రెజరర్ గుర్రయ్య, కార్యదర్శులుగా బి.వి.శ్రీనివాసులరెడ్డి, ఎం.గురయ్య, రాజా, శ్రీధర్‌రెడ్డి, విజయభాస్కర్, సాహిత్య, సుధారాణి, శ్రీకాంత్ , పెంచలయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా మాదన విజయ్‌కుమార్, గురుప్రసాద్, శివ ప్రసాద్, దేవానందం, సుధాకర్, పాలా శ్రీనివాసులరెడ్డి, చక్రపాణి, మస్తాన్‌రెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా పవన్‌కుమార్ సభ్యులుగా గౌస్ బాష , మురళికృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఎన్నికల పరిశీలకుడుగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గురుప్రసాద్, ఎన్నికల అధికారిగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఓబుల్‌రెడ్డి వ్యవహరించారు.

జోరుగా వర్షం

● జలమయమైన రోడ్లు ● చేనేత గుంత, మగ్గాలలో చేరిన వర్షపునీరు
● పలుచోట్ల నీట మునిగిన వరి, వేరుశనగ ● ప్రభుత్వం ఆదుకోవాలి: రైతులు



చాపాడులో వేరుశనగలో నిలబడిన వర్షపునీరు



ఖాజీపేట.. రోడ్డుపై పార్లుతున్న నీరు



జమ్మలమడుగు.. మోరగుడిలో గుంత మగ్గంలో నిండిన వర్షపునీరు

జమ్మలమడుగు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో రెండు రోజుల నుంచి ఎడతెరపి లేని వర్షం కురుస్తోంది. దీంతో పలు ప్రాంతాల్లోని రోడ్లు జలమయం అయ్యాయి. ప్రధానంగా జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామంలో 1వ వార్డు చికెన్ దుకాణం, శిల్పాలు తయారు చేసే రోడ్డులో వర్షపునీరు నిలిచి పాచికట్టింది . చౌడం లక్ష్మీనారాయణమ్మ ఇంటిలో, ఆవరణలో సమీపంలోని పలు గృహాల్లో వర్షపునీరు నిలిచింది. బాధితురాలు లక్ష్మీనారాయణమ్మ ఇంటిలో మగ్గపు గుంతలో నీళ్లు నిలిచి మోటారు ద్వారా ఆ నీటిని బయటికి తోడుతున్నారు. అలాగే 1వ వార్డులో వర్షపునీరు రోడ్లపై భారీగా నిలిచింది. అలాగే మోరగుడిలోని మూడు రోడ్ల కూడలి మాజీ ఎమ్మెల్యే కుండా రామయ్య విగ్రహం పక్కన రోడ్డుపై, భాగ్యనగర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచింది. కన్నెలూరులోని ఎస్సీ కాలనీ, శివార్లలో ఆర్టీసీ డిపో గ్యారేజీలో, ఎల్ఎంసీ కాంపౌండ్ తదితర ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచింది.

వరి పొలం పరిశీలన..: జమ్మలమడుగు మండలంలో వేమగుంటపల్లె, కొత్తగుంటపల్లె తదితర రెవెన్యూ గ్రామాల్లో బుధవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. తుఫాను కారణంగా కురుస్తున్న వర్షానికి ఆయా గ్రామాల్లో వరి పొలాన్ని ప్రస్తుత ఇన్‌చార్జి ఏవో గురుభాస్కర్ వారి సిబ్బంది పరిశీలించారు. రైతులకు తగిన సూచనలు అందించారు.

పోరుమామిళ్ల...: రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పోరుమామిళ్ల రహదారులు జలమయం కావడంతోప్రజలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు జోరుగా వర్షం కురవడంతో పోరుమామిళ్లలోని ఆర్టీసీబస్టాండు సమీపంలో అంబేడ్కర్ సర్కిల్, సాయిబాబా దేవాలయం వద్ద, మైదుకూరు రోడ్డులోని దస్తగిరి రైస్‌మిల్లు వద్ద రోడ్లపైకి వర్షం నీరు చేరి కుంటలను తలపించాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు అంతరాయం కలిగింది. ఎప్పుడు వర్షం కురిసినా సాయిబాబా దేవాలయం వద్ద మోకాలిలోతు నీరు పారుతూనే ఉంటుంది. రోడ్డుకిరువైపులా డ్రైనేజీ కాల్వ లేకపోవడంతో ఆ నీరంతారోడ్డుపైనే నిల్వ ఉండిపోయింది. మహాత్మాగాంధీ విగ్రహం వెనుక వైపు ఉన్న దుకాణాల వద్ద కూడా వర్షం నీరు చేరి ప్రజలకు ఇబ్బంది కలిగిం చాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా కాలువలో మురుగునీరు చేరి చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలిగించింది. అధికారులు, నాయకులు చొరవ తీసుకుని అసంపూర్తిగా మిగిలిన రోడ్డు విస్తరణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బి.కోడూరు..: మండలంలో మూడురోజుల నుంచి భారీగా వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది. వర్షంతో రైతులకు కొంత మేర నష్టం జరిగింది. రైతులు వేసుకున్న వరి పంట కోత దశలో ఉండగా కొంత మేర నష్టం జరిగింది. అధికారులు పరిశీలించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

చాపాడు..: తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని పలు గ్రామాల వద్ద సాగు చేసిన వేరుశనగ పైరు నీట మునిగింది. మూడు రోజుల నుంచి వర్షం భారీగా కురుస్తోంది. పొలాల్లో వర్షపునీరు నిలబడి ఉన్నాయి. వెదురూరు, రాజుపాళెం, తిప్పిరెడ్డిపల్లె, నరహరిపురం గ్రామాల్లో సాగు చేసిన సుమారు 4 వేల ఎకరాల్లో వేరుశనగ నీట మునిగింది. రైతులు 25 రోజుల క్రితం వేరుశనగను సాగు చేశారు. నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పైరు ఏపుగా పెరిగి దిగుబడి సక్రమంగా రాదని వారు తెలిపారు. పలు రకాల తెగుళ్లు, చీడపురుగులు ఆశించే అవకాశం ఉందన్నారు. ఎకరా సాగు చేసినందుకు సుమారు రూ.25 వేలు ఖర్చు అయిందని రైతులు తెలిపారు.

ఖాజీపేట..: అధికారుల నిర్లక్ష్యానికి రైతులు బలి కావాల్సి వస్తోంది. వేసవి కాలంలో కాలువల మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యంగా అధికారులు వ్యవహరించారు. కేసీ కెనాల్‌కు నీరు వచ్చిన తర్వాత తూతూ మంత్రంగా పనులు చేసి వదిలేస్తారు. వర్షం వచ్చినప్పుడు నీరు అధికంగా రావడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లె సమీపంలో కేసీ కాలువకు వ్యర్థాలు అడ్డుపడడంతో కాలువ కట్ట పొర్లి వరి పంట నీట మునిగింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జమ్మలమడుగు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణ శివార్లలో సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర రక్తగాయమైన సున్నపురాళ్ల గ్రామానికి చెందిన పూజారి రాజేష్ (28) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వ్యక్తిని అదే రోజు జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి మెరుగైన చికిత్సకోసం తిరుపతికి తరలించారు. తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుడిని జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి బుధవారం తరలించారు. మృతుడికి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టిప్పరు స్వాధీనం

పోరుమామిళ్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా టిప్పరులో ఇసుకను రవాణా చేస్తుండగా తనిఖీ నిర్వహించి దానిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్వీ కొండారెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి ఆయన మాట్లాడుతూ పోరుమామిళ్ల సమీపంలోని మల్లకతవ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మైదుకూరు టిప్పరు సుమారు 30 టన్నుల ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నందుకు డ్రైవరు కూరాకు సిద్దయ్యను అదుపులోకి తీసుకుని, టిప్పరును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన చంద్రశేఖర్‌రెడ్డి

ఖాజీపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆంజనేయకొట్టాలుకు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని చంద్రశేఖర్‌రెడ్డి (60) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు ఆంజనేయకొట్టాలుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి పని నిమిత్తం వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కాలు విరగడంతోపాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 ద్వారా కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

రేపటి నుంచి వార్డు మెంబర్లకు శిక్షణ

చాపాడు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 18న శుక్రవారం నుంచి రెండు రోజులపాటు గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్, వార్డు మెంబర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో రామానుజం తెలిపారు. వారికి శిక్షణ గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రణాళిక తయారు చేసేందుకు సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఇద్దరేసి చొప్పున వార్డు మెంబర్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. మండలంలో మొత్తం 22 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ శిక్షణకు ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు హాజరుకావాలని ఆయన కోరారు.

డిపో కార్యదర్శిగా వి.యస్ రాయుడు

మైదుకూరు రూరల్ అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో కార్యదర్శిగా వి.యస్ రాయుడిని కార్మికులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మేధా జూనియర్ కళాశాలలో బుధవారం ఆర్‌టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఎన్నిక జరిగింది.ఈ కార్యక్రమానికి మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివారెడ్డి, రీజనల్ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ జాబితా ప్రదర్శన

కొండాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతు సేవా కేంద్రాల్లో ఈ-క్రాప్ జాబితాను ప్రదర్శించినట్లు ఏవో రామాంజులరెడ్డి తెలిపారు.రైతులు తమ పేర్లు, నీటిపారుదల పద్ధతి, పంట పేరు జాబితాలో సరిచూసుకోవాలని ఏవో తెలిపారు. అదేవిధంగా వర్షాలకు ఎక్కడైనా పంటనష్టం వాటిల్లితే తమకు తెలియజేయాలని ఆయన తెలిపారు.